త్రిపుల్ ఐటీ పన్నులే.. నూజివీడు ఆదాయంలో సగం

రామిశెట్టి మురళీకృష్ణ, కోఆప్షన్ సభ్యుడు



నూజివీడు మునిసిపల్ సమస్యల పరిష్కారానికి దాదాపు 8 కోట్ల రూపాయల లోటు ఉంది. మునిసిపాలిటీ పరిధిలో వచ్చే ఆదాయంలో సగం త్రిపుల్ ఐటీ ట్యాక్స్‌ల ద్వారానే వస్తోంది. మునిసిపాలిటీ పరిధిలో ఏటా రహదారుల విస్తీర్ణం పెరుగుతున్నా మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది మాత్రం పెరగలేదు. పారిశుధ్య సిబ్బందిని పెంచాలన్నా, మునిసిపాలిటీపైనే వారి జీతాల భారం పడుతోంది.

వచ్చే ఆదాయం కరెంటు చార్జీలకు సరి

పగడాల సత్యనారాయణ, కౌన్సిలర్, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్



నూజివీడు మునిసిపాలిటీ అభివృద్ధికి సంబంధించి 14,15 ఆర్థికసంఘం నిధులే ఆధారం. ఆ నిధులు సైతం తాగు నీటి సరఫరాకు సం బంధించిన విద్యుత్ బిల్లులకు సరిపోతున్నాయి. మునిసి పాలిటీకి జనరల్ ఫండ్ ఉన్నా అదికాస్తా కాంట్రాక్టర్లకు ఇవ్వాల్సిన పెండింగ్ బిల్లులకు వెళ్లిపోయాయి. మునిసిపాలిటీలో శ్మశాన ఆక్రమ ణలను ఇప్పటికే తొలగించాం. త్రిపుల్ ఐటీ నుంచి వచ్చే మురుగునీటి సమస్య పరిష్కారానికి అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ నిర్మాణానికి ఇప్పటికే టెండర్లు పూర్తయ్యాయి. ఇక తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాం. నూజివీడు మునిసిపాలిటీలో 3వేల వాటర్ కనెక్షన్లు ఉంటే 90 శాతం వాటర్ కనెక్షన్లకు అనధికారిక మోటార్లు ఉండటంతో తాగునీటి సరఫరా సమర్థవంతంగా అందించలేని పరిస్థితి ఉంది.

అండర్ గ్రౌండ్ డ్రెయినేజీకి డీపీఆర్

అభిషేక్, మునిసిపల్ ఏఈ



నూజివీడు మురుగునీటి సమస్య పరిష్కారానికి అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటుకు డి.పి.ఆర్‌కు సర్వే అయింది. ఎస్‌టిపి ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నాం. గొల్లపూడి నుంచి నూజివీడుకు కృష్ణాజలాలు వస్తున్నాయి. ఫలితంగా తాగునీటి సమస్య ఏర్పడుతోంది. నూజివీడులో సమ్మర్ స్టోరేజ్ ప్లాంట్ ఏర్పాటుకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాం.

సమస్య పరిష్కారానికి చర్యలు

నాగరాజు, మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్



పారిశుధ్య మెరుగుకు సిబ్బందిని సమర్థవంతంగా వినియోగించి చర్యలు చేపడతాం. ఒకటి, రెండుచోట్ల సమస్య ఉంది. ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణ, డ్రెయిన్‌లలో చెత్త పడవేయకుండా ప్రజలకు అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలను చేపట్టాం. కుక్కలు, కోతుల సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం.

మూడు దశాబ్దాలుగా వేధిస్తున్న నూజివీడు డ్రెయినేజీ సమస్యకు 'ఆంధ్రజ్యోతి' సంకల్పించిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' సదస్సు పరిష్కార మార్గాలకు వేదిక అయింది. చానాళ్ళుగా పట్టణాన్ని పట్టిపీడిస్తున్న ఈ సమస్యపై నిర్వహించిన సదస్సుకు హాజరైన స్థానికులు, రాజకీయ పక్ష నాయకులు సూచనలు చేశారు.



సదస్సులో ప్రసంగిస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ..చిత్రంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, కౌన్సిలర్ పగడాల సత్యనారాయణ, కోఆప్షన్ సభ్యుడు రామిశెట్టి మురళీకృష్ణ, ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి దేవగళ్ల రామకృష్ణ, బ్యూరో ఇన్‌చార్జి జీవీఎస్ఎన్ రాజు

పరిష్కారం మాది.. బాధ్యత మీది!

నూజివీడులో ఆంధ్రజ్యోతి 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' సదస్సుకు అపూర్వ స్పందన

- క్రమశిక్షణ పాటిస్తే విజయం మనదే..
- నూజివీడు డ్రెయినేజీ సమస్యకు రోజుల్లో మోక్షం
- ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పష్టమైన హామీ
- పట్టణంలోని పలు సమస్యలపై గళం విప్పిన స్థానికులు
- వారికి జత కలిసిన రాజకీయ పార్టీల ప్రతినిధులు

నూజివీడు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : నూజివీడు సంగం కాంప్లెక్స్‌లో మంగళ వారం 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' సదస్సు చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణి దుర్గ ముఖ్య అతిథిగా హాజరు కాగా, నూజివీడుకు చెందిన పలువురు రాజకీయ పక్షాల నాయకులతో పాటు వివిధ వార్డుల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో హాజరై తమ సమస్యలను మునిసిపల్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీర్ఘకాలికంగా పేరుకు పోయిన ఈ సమస్యను తక్షణం తీర్చేందుకు వీలుగా ప్రజా ప్రతినిధులు, అధికారులు కదలక తప్పదన్న సూచన వచ్చింది. దీంతో పాటు సమాంతరంగా వార్డుల వారీగా సమన్వయ ప్రజా కమిటీని నియమించాలని, విలువైన సూచన తెర ముందుకొచ్చింది. ఒక రోజుతో కాకుండా దీర్ఘకాలిక ప్రణాళికతో ఈ సమస్యను తుద ముట్టించాల్సిందిగా అత్యధికులు అభిప్రాయ పడ్డారు. 'పరిష్కారం మాది బాధ్యత మీది. డ్రెయిన్‌లలో చెత్తా చెదారం నింపేయకుండా బాధ్యతతో అందరూ వ్యవహరించాల్సిందే. పారిశుధ్య నిర్వహణకు మా వంతు ప్రయత్నం ఎలాగూ ఉంటుంది. రోజు ల వ్యవధిలోనే ఈ సమస్యను పరిష్కరించేందుకు మేము సిద్ధం' అని సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గతోపాటు మిగతా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పష్టతతో కూడిన హామీ ఇచ్చారు.

నూజివీడులో డ్రెయినేజీల అధ్వాన స్థితిని కళ్లకు కట్టినట్టుగా 'ఆంధ్రజ్యోతి' సోమవారం కథనం ప్రచురించింది. దీనిపై రాష్ట్ర మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి డ్రెయినేజీ సమస్యల పరిష్కారానికి కోటి రూపాయల వ్యయంతో పక్కా ప్రణాళికలతో తక్షణం ముందుకు కదలాల్సిందిగా మున్సిపల్ యంత్రాంగాన్ని ఆదేశించిన 24 గంటల్లోపే 'ఆంధ్రజ్యోతి సదస్సులోనూ మున్సిపల్ యంత్రాంగం ఒకవైపు, కౌన్సిల్‌లో బాధ్యులు మరోవైపు ప్రజలకు తాము ఏం చేయబోతున్నామో వివరణాత్మకంగా భరోసా కల్పించారు. దీంతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలు ప్రస్తావనకు రాగా 'ఆంధ్రజ్యోతి' ప్రజాపక్షాన నిలిచి, ఇందుకు అవకాశం కల్పించడం శుభపరిణామంగా హాజరైన వారంతా అభినందనలు కురిపించారు.

ప్రధానంగా నూజివీడు గ్రామంగా ఉన్న సమయంలో ఏర్పాటైన డ్రెయిన్‌లే నేటికీ ఉండడంతో వాటిని పునర్‌నిర్మాణం చేయాల్సిన పరిస్థితి ఉందని, దీంతో పాటు రహదారుల విస్తరణ సైతం చేపట్టాలని, వివిధ రాజకీయపక్షాల నాయకులు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పట్టణంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, విజయవాడ నుంచి దాదాపు 56 కి.మి దూరం పైప్‌లైన్ల ద్వారా తాగునీటిని ఇక్కడికి సరఫరా చేసి అందిస్తున్న పరిస్థితుల్లో వ్యయ ప్రయాసలతో పాటు ప్రతిరోజూ తాగునీరు అందించలేని పరిస్థితి ఏర్పడుతోందని, దీని పరిష్కారానికి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును ఏర్పాటు చేయాలంటూ సమస్యలు ఏకరువు పెట్టడంతో పాటు సమస్యల పరిష్కార సూచనలు చేయడం విశేషం. డివిజన్ కేంద్రమైన నూజివీడుకు వివిధ పనులపై నూజివీడు వచ్చే వారికి టాయ్‌లెట్ల నిర్మాణం, పట్టణంలో తీవ్ర సమస్యగా ఉన్న కుక్కలు, కోతుల నియంత్రణ తదితర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. గత పాలకులు నూజివీడు పట్టణంలో ఆటోనగర్ ఏర్పాటుచేసినా పరిశ్రమలు దాదాపుగామూతపడి, స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేకుండా పోయాయని, నూజివీడులో ఏర్పాటుచేసిన ఆటోనగర్‌కు పూర్వవైభవం తీసుకొచ్చి ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జమిందారి కాలంనాటి రహదారుల విస్తరణకు గత 20 ఏళ్ల క్రితమే నూజివీడు మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేసింది. అయితే అది ఆచరణలోకి రాకపోవడంతో పట్టణం విస్తరించి, ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. సమస్య పరిష్కారానికి రహదారుల విస్తరణ చేపట్టి స్థానికంగా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయాలి.



ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కమిటీలు ఏర్పాటు

నూజివీడు పట్టణంలో డ్రెయిన్ సమస్య పరిష్కారానికి, పారిశుధ్య నిర్వహణకు పట్టణంలోని 32 వార్డుల్లో ప్రత్యేక కమిటీలను ఏర్పాటుచేసి సచివాలయాల పరిధిలో పారిశుధ్య నిర్వహణను పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది. అదే సందర్భంలో ప్రతిరోజూ సాయంత్రం సమయంలో గ్రామంలో ఉత్పన్నమయ్యే తడి, పొడిచెత్తల సేకరణకు చెత్త వాహనాలను ఏర్పాటుచేస్తే వ్యాపార సంస్థల నుంచి ఉత్పన్నమవుతున్న చెత్తను డంపింగ్ యార్డుకు తరలించే అవకాశం ఉంటుంది. తద్వారా ఉదయం పూట ఉత్పన్నమయ్యే చెత్తను కొంతవరకు తగ్గించి, శానిటేషన్ సిబ్బంది పై భారం తగ్గించవచ్చని చర్చావేదికలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పేర్కొన్నారు. సదస్సులో ఈ కార్యక్రమానికి సంబంధించిన పూర్తి వివరాలను ఎడిషన్ ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి దేవగళ్ల రామకృష్ణ, బ్యూరో ఇన్‌చార్జి జీవీఎస్ఎన్ రాజు వివరించారు.

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..

ఆంధ్రజ్యోతి

వారం రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు



నూజివీడులో డ్రెయిన్ సిల్ట్ సమస్య పరిష్కారానికి వారం రోజుల్లో చర్యలు చేపడతాం. ప్రధానంగా ప్లాస్టిక్ నిర్మూలన ద్వారా డ్రెయినేజీ సిల్ట్ సమస్యను అధిగమించవచ్చు. మున్సిపల్ పరిధిలో పారిశుధ్య కార్మికుల అలక్ష్యం లేదు. సదస్సులో వచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి చర్యలు చేపడతాం. ప్రతి అంశంలోనూ మునిసిపాలిటీదే బాధ్యత కాదని, ప్రజలు కూడా దీంట్లో భాగస్వాములు కావాల్సి. డ్రెయిన్‌ల పరిశుభ్రత మరిచి ఎవరూ కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దు. కొబ్బరి బొండాలు, వివిధ వ్యర్థాలు, డ్రెయిన్‌లో విసిరి సమస్య తీవ్రతను పెంచవద్దు. 'ఆంధ్రజ్యోతి' చేపట్టిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' సదస్సులో పాల్గొన్న ప్రజలు చేసిన సూచనలను సైతం పరిగణలోకి తీసుకుంటాం.

- రామిశెట్టి త్రివేణిదుర్గ, మునిసిపల్ చైర్‌పర్సన్

మురుగు, తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్



పట్టణంలో తాగునీటి సమస్య, మురుగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి. రహదారులను వెడల్పు చేయడంతో పాటు డ్రెయిన్‌ల అంచుల వరకు రహదారులను వేయడం ద్వారా ట్రాఫిక్ సమస్యను కొంతవరకు అధిగమించవచ్చు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రూ.40 లక్షల ప్రత్యేక నిధులతో మెయిన్ డ్రెయిన్‌లలో సిల్ట్ తొలగింపునకు మంత్రి చొరవ చూపారు. మెయిన్ డ్రెయిన్లలో మూడేళ్లకు ఒకసారి సిల్ట్ తీసేలా ప్రణాళిక ఉండాలి. ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడంతో ఏటా సిల్ట్ తీసే పరిస్థితి ఏర్పడింది. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు తాగునీటి సమస్య పరిష్కారానికి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును ఏర్పాటు చేయాలి.

- చెరుకూరి దుర్గాప్రసాద్, మునిసిపల్ ఫ్లోర్‌లీడర్



సదస్సుకు హాజరైన స్థానికులు, రాజకీయ నేతలు

రూ. 3 కోట్ల పనులకు ఓకే..

- సమావేశంలో హామీ ఇచ్చిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్
- తాడేపల్లిగూడెం గణేష్‌నగర్‌లో ఆంధ్రజ్యోతి సదస్సు



ఎమ్మెల్యేకు గోడు వెళ్లబోసుకుంటున్న మహిళ.. చిత్రంలో ఆంధ్రజ్యోతి బీఎం హరిబాబు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం గణేష్ నగర్‌లో ఆంధ్రజ్యోతి నిర్వహించిన 'అక్షరమే అండగా.. పరిష్కారమే అజెండాగా' నిర్వహించిన కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. కాలనీవాసులు విచ్చేసి తమ సమస్యలు విన్నవించారు. నిట్ రహదారికి ఆనుకుని ఉన్న ఎఫ్‌సీఐ కాలనీ, గణేష్ నగర్, సిపాయిపేట, భూపాల్‌నగర్, వీకర్స్ కాలనీకి చెందిన ప్రజలు హాజరై సమస్యలను విన్నవించుకున్నారు. నిట్ రహదారికి వీధి లైట్లు వేయాలని, రహదారి విస్తరించాలని ప్రజలు కోరారు. వీటిపై ఎమ్మెల్యే కీలక ప్రకటన చేశారు. కాంప్లెక్స్ నుంచి నిట్ రహదారిని విస్తరించనున్నట్టు తెలిపారు. రెండు వైపులా ఐదు అడుగుల వంతున వెడల్పు చేసేందుకు మార్కింగ్ చేసి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గణేష్ నగర్ వద్ద సర్కిల్ ఏర్పాటుకు హామీ ఇచ్చారు. పార్క్ సుందరీకరణపై చర్యలు తీసుకుంటున్నట్టు ప్రకటించారు. గణేష్ నగర్- నిట్ నుంచి ఎస్‌వీఆర్ సర్కిల్ వరకు రహదారి, డ్రెయిన్ నిర్మించేందుకు భరోసా ఇచ్చారు. త్వరలోనే నిర్మాణం పూర్తవుతుందన్నారు. వీటన్నింటికీ రూ.3 కోట్లు వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేయగా పనులు చేపట్టేందుకు ప్రభుత్వం, మున్సిపాలిటీ సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే ప్రకటించారు.



హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి,తదితరులు

ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలి : కలెక్టర్

ఏలూరు క్రైం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు విధిగా హెల్మెట్, సీటు బెల్టు ధరించాలని కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం రవాణాశాఖ ఆధ్వర్యంలో ఏలూరులో చేపట్టిన బైక్ ర్యాలీని పోలీస్ పెట్రోల్ బంకు వద్ద ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి)తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 'శ్రద్ధ వహించండి' అనే నినాదంతో రోడ్డు భద్రతపై నెలరోజులపాటు వివిధ రూపాల్లో అవగాహన కలిగించే అంశాలపై రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. జిల్లాలో గత ఏడాది కాలంలో 595 రోడ్డు ప్రమాదాలు జరగ్గా 290 మంది మృతి చెందగా మరో 628 మంది క్షతగాత్రులయ్యారన్నారు. కలెక్టరేట్‌తో పాటు అన్ని ప్రభుత్వ శాఖల్లో ద్విచక్రవాహనం కలిగిన ప్రతి ఉద్యోగి హెల్మెట్ ధరించి కార్యాలయాలకు హాజరు కావాలని ఇప్పటికే ఆదేశించామన్నారు. ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ హెల్మెట్ ధరిస్తే రోడ్డు ప్రమాదాల సమయంలో ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చన్నారు. ర్యాలీలో నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుడు ఎస్ ఎంఆర్ పెదబాబు, మాజీ కార్పొరేటర్ చోడే వెంకటరత్నం, ఇన్‌చార్జి ఉప రవాణా కమిషనరు కృష్ణారావు, ఆర్డీవో అచ్యుత అంబరీశ్, డీఎస్పీ శ్రావణ్ కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని, అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ నాగేశ్వరరావు, సాయిస్వర్ణ హీరో షోరూమ్ జనరల్ మేనేజర్ సోమేశ్వరరావు, పోలీస్, రవాణాశాఖ అధికారులు పాల్గొన్నారు. కాగా హెల్మెట్ ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ హెల్మెట్ లేకుండా బైక్‌లపై వెళ్తుతున్న ద్విచక్ర వాహనదారులకు ఆపి హెల్మెట్ ప్రాముఖ్యాన్ని ఆవశ్యకతను వివరించి వారికి హెల్మెట్లను అందజేశారు.

పిట్టలోళ్ల గుడిసెల దగ్ధం ఘటనలో.. చికిత్స పొందుతూ మరో ముగ్గురి మృతి 5

కల్లుగీత మద్యం షాపులకు.. గెజిట్ నోటిఫికేషన్

- ఫిబ్రవరి ఐదు వరకు దరఖాస్తుల స్వీకరణ
- 6న దరఖాస్తుల పరిశీలన
- 7న జిల్లా కేంద్రం ఏలూరులో లాటరీ ద్వారా కేటాయింపు

ఏలూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గీత కార్మికులకు కేటాయించిన మద్యం షాపులకు సోమవారం రాత్రి పొద్దుపోయాక గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. దీంతో మద్యం షాపుల భర్తీకి లైన్‌క్లియర్ అయ్యింది. జిల్లాలో మద్యం షాపుల 141 ఉండగా రిజ ర్వేషన్ లిక్కర్ షాపుల కోటా కింద 14 షాపు లను గీత కార్మికుల ఉపకులాలకు ప్రకటిం చారు. జిల్లాలో ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో కల్లుగీత కార్మికుల్లోని ఉపకులా లకు కేటాయించిన 14 షాపులకు కలెక్టర్ వెట్రిసెల్వి శుక్రవారం (ఈనెల 24న) లాటరీ తీశారు. గౌడకు 2, గౌడ్‌కు 4, శెట్టిబలిజలకు 8 షాపులను ఆయా కులాల జనాభా ప్రాతిపదికన కేటాయించాల్సి ఉండగా లాటరీ ద్వారా సామా జిక వర్గాలకు కేటాయింపును గౌడ్ సామాజిక వర్గానికి నూజీవీడు మునిసిపాలిటీ పరిధిలోని ఒక షాపు, చింతలపూడి రూరల్ ప్రాంతంలో ఒక షాపు, గౌడకు ఏలూరు మునిసిపల్ కార్పొరేషన్, టి.నరసాపురం, దెందులూరు, జంగారెడ్డిగూడెం రూరల్‌లోను కలిపి ఒక్కొక్కటి చొప్పున 4, శెట్టిబలిజకు జంగారెడ్డిగూడెం మునిసిపాలిటీ, చింతలపూడి, చాట్రాయి, ముసునూరు, మండవల్లి, నిడమర్రు, ఆగిరిపల్లి, కొయ్యలగూడెం మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున 8 షాపులను భర్తీ చేయనున్నారు.

దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

గెజిట్ నోటిఫికేషన్ విడుదలతో షాపుల భర్తీకి అర్హులైన వారు దరఖాస్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో చేసుకోవచ్చు. జిల్లాలో ఉన్న ఎక్సైజ్ స్టేషన్లలో రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించారు. ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు కాపీని సంబంధిత ఎక్సైజ్ స్టేషన్‌లో అందజేయాలి. అభ్యర్థులు నివాస, కుల ధ్రువీకరణ పత్రాలను జత చేస్తూ రూ.2లక్షల ధరావత్తు రుసుము (నాన్ రిఫండబుల్)గా చెల్లించాలి. దుకాణాల కేటాయింపునకు సంబంధించి ఈనెల 7న ఉదయం 10 గంటలకు ఏలూరు సురేష్ బహుగుణ పోలీస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆడిటోరియంలో కలెక్టర్ వెట్రిసెల్వి లాటరీలు తీసి లైసెన్సులు ఎంపిక చేస్తారని ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ ఆవాల ఆవులయ్య, అసిస్టెంట్ సూపరింటెండెంట్ పాండు రంగారావు తెలిపారు. గౌడ్, గౌడ కులాలకు సంబంధించి తమ కుల ధ్రువీకరణ ఉపకులం విధిగా ఉండే సర్టిఫికెట్‌ను జాగ్రత్తగా చూసుకుని దరఖాస్తు చేసుకోవా లని సూచించారు. ఇతర వివరాలకు ఆయా ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాల్లోని సీఐలు ఏలూరు సీఐ ధనరాజ్ 94409 02427, చింతలపూడి సీఐ అశోక్ 94409 02428, జంగారెడ్డిగూడెం సీఐ కె.శ్రీనిబాబు 94409 02431, పోలవరం సీఐ కె. వీరబ్రహ్మం 94409 02432, భీమడోలు సీఐ సత్యనారాయణ 94409 02429, కైకలూరు సీఐ 94409 02428, నూజీవీడు సీఐ ఎ.మస్తానయ్య 94409 02462 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు. ఈ షాపుల లైసెన్సుల గడువు 2026 సెప్టెంబరు 30 వరకు ఉంటుందన్నారు. ఎన్ని షాపులకు దరఖాస్తు చేసుకున్న లాటరీలో ఒకటి కంటే ఎక్కువ వస్తే ఏదో ఒకటి మాత్రమే ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందన్నారు. లైసెన్సు రిజర్వ్ ధర ఏడాదికి రూ.35.75 లక్షలు కాగా గడిచిన నెలలకు మినహాయించి 21.66 లక్షల 667 రూపాయల షాపునకు కట్టాల్సి ఉంటుంది.

3 వరకు రైల్వే గేటు మరమ్మతులు

భీమడోలు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : భీమడోలులో నిర్వహిస్తున్న రైల్వే ట్రాక్ పనులు వచ్చే నెల 3వ తేదీ వరకు కొనసాగుతాయని రైల్వే అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత ఈనెల 30 తేదీ వరకు పనులు జరుగుతాయని రైల్వే అధికారులు ప్రకటించారు. అయితే పనులు పూర్తి కాకపోవడంతో వచ్చేనెల 3 తేదీ వరకు రైల్వే గేటును మూసివేయనున్నట్టు ప్రకటించారు. ఈ మార్గం మీదుగా వెళ్లే ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లాలని కోరారు.

టౌన్ ప్లానింగ్ అవకతవకలపై విచారణ

ఏలూరు టూటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగంలో నిబంధనలకు విరుద్ధంగా మంజూరు చేసిన గృహ నిర్మాణాల ప్లాన్‌లకు సంబంధించిన ఫిర్యాదులపై రాజమండ్రి ఆర్డీడీ కార్యాలయం సిబ్బంది నగరంలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో టీపీవోగా విధులు నిర్వహిస్తున్న సాంబశివరావు కొందరు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి చేపట్టిన ఇళ్ల నిర్మాణాలకు నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా అనుమతులు ఇచ్చారని రిటైర్డ్ మునిసిపల్ ఆర్డీ రాజేంద్రప్రసాద్ స్టేట్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ విభాగానికి, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు 2022లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే ఆర్డీడీ కార్యాలయం నుంచి టీపీఏ రమణ విచారణ నిమిత్తం వచ్చారు. డిస్ట్రిక్ట్ కంట్రీ అండ్ టౌన్ ప్లానింగ్ ఇన్‌చార్జి యూనీస్‌తో కలిసి నగరంలో నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇచ్చిన నిర్మాణాలను పరిశీలించారు. జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న నిర్మాణాలను, అశోక్ నగర్‌లో ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించిన ప్రాంతాలను పరిశీలించారు. దీనిపై రమణను వివరణ కోరగా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మించిన ఇళ్లను పరిశీలించామన్నారు. పై అధికారులకు నివేదికను సమర్పిస్తానని తెలిపారు. ఇదిలా ఉండగా విచారణకు వచ్చిన అధికారులతో కలసి అభియోగాలు ఎదుర్కొంటున్న టీపీవో సాంబశివరావు కూడా అక్రమంగా అనుమతులు ఇచ్చిన ఇళ్ల పరిశీలనకు వెళ్లడం విమర్శలకు దారి తీసింది.


తాడేపల్లిగూడెంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న మహిళ


నూజివీడు సదస్సులో పాల్గొన్న ప్రజలు


నూజివీడులో మాట్లాడుతున్న ఆంధ్రజ్యోతి బ్యూరో ఇన్‌చార్జి జీవీఎస్ఎన్ రాజు


తాడేపల్లిగూడెంలో ప్రజా సమస్యలు వింటున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..

ఆంధ్రజ్యోతి

తెలుగు ప్రజల గుండె చప్పుడు ఆంధ్రజ్యోతి. నిత్యం వినూత్న కథనాలతో.. ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తూ బాధితుల పక్షాన అండగా నిలుస్తోంది. తాజాగా 'ఆంధ్రజ్యోతి అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఏలూరు జిల్లా నూజివీడు జంక్షన్ రోడ్‌లోని సంగం కాంప్లెక్స్ మినీ ఫంక్షన్ హాలు, పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం గణేశ్ నగర్‌లోని సుబ్రహ్మణ్యస్వామి గుడి వద్ద మంగళవారం సదస్సులు జరిగాయి. తాడేపల్లిగూడెంలో సమస్యలను పరిష్కరిస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ప్రజలకు హామీ ఇచ్చారు. నూజివీడులో మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణి దుర్గ సమస్యలపై స్పందించి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.

తాడేపల్లిగూడెం, నూజివీడు పట్టణాల్లో సమస్యలపై ప్రజాగళం

డ్రెయినేజీ ఏర్పాటు చేయాలి



ఎఫ్‌సీఐ కాలనీలో రోడ్డులో డ్రెయినేజీ సమస్య ఎక్కువగా ఉంది. ఆ ప్రాంతంలో ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. వెంటనే డ్రెయినేజీ ఏర్పాటు చేయాలి. దానికి మా వంతు సహకారం అందిస్తాం. దీనికితోడు గణేష్‌నగర్ ప్రధాన రహదారిలో వీధిలైట్లు వెలగడం లేదు. రోడ్డు విస్తరించి వీధిలైట్లు వేస్తే ప్రజలు భయం లేకుండా తిరుగుతారు.

- మేడవరపు రంగారావు, ఎఫ్‌సీఐ కాలనీ అధ్యక్షుడు

ఇప్పుడైనా పరిష్కారమవ్వాలి



మాది ఎఫ్‌సీఐ కాలనీ 9వ నెంబరు రోడ్డు. ఈ రోడ్డులో డ్రెయినేజీ బాగా సమస్యగా ఉంది. వర్షం వస్తే రోడ్డు, వీధుల్లో నీరు నిలిచిపోయి బయటకు రాలేని పరిస్థితి. ఈ సమస్యపై గత ప్రభుత్వంలో మూడుసార్లు మున్సిపల్ అధికారులకు దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పుడైనా సమస్య పరిష్కరిస్తారని ఆశిస్తున్నాం.

- దాసరి లక్ష్మి, ఎఫ్‌సీఐ కాలనీ, తాడేపల్లిగూడెం


వర్షం నీరు నిలిచిపోతోంది



గణేష్ నగర్ గుడి వెనకాల ప్రాంతంలో వర్షం వస్తే నీరు బయటకు కదలకుండా రోడ్లపైనే నిలిచిపోతోంది. దీంతో ఆ ప్రాంతంలో బయట అడుగు పెట్టలేని పరిస్థితి. పిల్లల్ని స్కూల్‌కి పంపించాలన్నా ఇబ్బంది పడుతున్నాం. దోమలు పెరిగి వ్యాధులు ప్రబలుతున్నాయి. డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలని కోరుతున్నాం.

- పసుపులేటి అరుణ, గణేష్ నగర్, తాడేపల్లిగూడెం

ఇళ్ల మధ్యలో చెత్త



గణేష్ నగర్‌లో ఇళ్ల మధ్యలో చెత్త పడేస్తున్నారు. స్థానికులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. మున్సిపల్ కార్మికులు వచ్చినా వారికి ఇవ్వకుండా ఇళ్ల ముందే పడేస్తున్నారు. దీనిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి. ప్రజల్లో అవగాహన పెంచి చెత్త పడేయకుండా చూడాలి

- నిట్టా సుబ్బారావు, గణేష్ నగర్, తాడేపల్లిగూడెం

మురుగునీటితో ఇబ్బందులు



ఈ కాలనీలో 20 ఏళ్లుగా అద్దెకు ఉంటున్నాం. ఆ ప్రాంతంలో డ్రెయినేజీ వాటర్ అంతా మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలోకి వదిలేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో విపరీతంగా మురుగు, దోమలు పెరిగిపోయి మేమంతా అనారోగ్యాల పాలవుతున్నాం. ఈ సమస్యకు అధికారులు పరిష్కారం చూపాలి.

- యడ్లపల్లి పవన్‌కుమార్, వీకర్స్ కాలనీ, తాడేపల్లిగూడెం


మురుగు నిలిచిపోతోంది



మా ప్రాంతంలో ఇటీవల సీసీ రోడ్లు నిర్మాణం చేశారు. రాకపోకలకు సౌకర్యంగా ఉంది. ఎంతో సంతోషం. కానీ డ్రెయిన్‌లు లేకపోవడంతో నీరు నిలిచిపోతోంది. దోమలు వ్యాప్తి చెంది అనారోగ్య పరిస్థితులు నెలకొన్నాయి. సీసీ డ్రెయిన్లు నిర్మిస్తే మా ప్రాంతంలో మురుగునీటి సమస్య ఉండదు. వెంటనే రోడ్లతో పాటు డ్రెయిన్‌లు వేయాలి.

- షేక్ సబీర్ బేగం, సిపాయిపేట, తాడేపల్లిగూడెం

డ్రెయిన్ సౌకర్యం లేదు



ఎఫ్‌సీఐ కాలనీ 2వ రోడ్డులో గ్రావెల్ రోడ్లు వేశారు. కానీ ఆ ప్రాంతంలో డ్రెయినేజీ సౌకర్యం లేదు. వర్షం వస్తే రోడ్డంతో మునిగిపోతుంది. బురదలో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. అధికారులు తక్షణం స్పందించి డ్రెయిన్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలి. ప్రజల ఇబ్బందులను పరిష్కరించాలి.

- పి.రాజభూషణం, ఎఫ్‌సీఐ కాలనీ, తాడేపల్లిగూడెం

విద్యుత్ స్తంభంతో భయం



గణేష్ నగర్ ప్రాంతంలో ఇనపకొట్టు వెనకాల విద్యుత్ స్తంభం ఒరిగి వైర్లు కిందికి వేలాడుతున్నాయి. పిల్లలు వాటిని పట్టుకుంటే ఏం ప్రమాదం జరుగుతుందో అని భయపడుతూ బతుకుతున్నాం. ప్రాణాపాయ పరిస్థితులు నెలకొన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ సమస్య వెంటనే పరిష్కరించాలని కోరుతున్నాం.

- కె.రంగమ్మ, గణేష్ నగర్, తాడేపల్లిగూడెం

ఇళ్ల స్థలాలు ఇప్పించాలి



మేమంతా బ్రాహ్మణ కుటుంబాలకు చెందిన వారం.. మాకు ఒక ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఇస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చినా ఏం చేయలేదు. ఇంటి స్థలం, ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నాం. హామీలు ఇస్తున్నారు కానీ కార్యాచరణ లేదు. కూటమి ప్రభుత్వంలో అయినా మాకు స్థలాలు ఇప్పించాలని కోరుతున్నాం.

- ఎస్.కాశీ విశ్వనాథం, ఎఫ్‌సీఐ కాలనీ, తాడేపల్లిగూడెం

చెరువుకట్ట బలోపేతం చేయాలి



పెద్ద చెరువుకు గండిపడి దాదాపు నూజివీడు సగం ప్రభావితమైంది. ముంపు సమస్య, తాగునీటి సమస్యలు తలెత్తాయి. మున్ముందు ఇలాంటి పరిస్థితి ఎదురుకాకుండా చెరువుకట్టను బలోపేతం చేయాలి. చెరువులను అభివృద్ధిచేసి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుగా ఉపయోగించాలి. పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలి

- కందిపల్లి చెన్నారావు, మాజీ కౌన్సిలర్, నూజివీడు

నిస్సారంగా పార్కులు



నూజివీడు మున్సిపాల్టీలో జనాభా పెరిగింది. కాంక్రీట్ అరణ్యంగా మారుతోంది. సేదతీరేందుకు కనీసం ఒక్కపార్క్ లేదు. ఉన్న పార్కులు నిర్వీర్యమైయ్యాయి. రాఫిన్ రియల్‌ఎస్టేట్ వారు డెవలప్ చేసిన పార్క్ సైతం ఇప్పుడు నిరుపయోగంగా మారింది. క్రీడాస్థలాలు, వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేయాలి.

- కోలాహలం సత్య వరప్రసాదరాజు, నూజివీడు

ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలు



ఇళ్ల మధ్యలో ప్రభుత్వ స్థలాలు ఖాళీగా ఉంటున్నాయి. వాటిలో పిచ్చి మొక్కలు అడవిలా పెరిగి పోయాయి. ఆ స్థలాల్లో పాములు తిరుగుతూ ఇళ్లలోకి చేరుతున్నాయి. వర్షాలు వస్తే రోజుల తరబడి నీరు నిల్వ ఉంటుంది. ఆ స్థలాలను గుర్తించి అవసరమైన చోట్ల ప్రభుత్వ భవనాలు, పార్కులు నిర్మించాలని కోరుతున్నాం.

- కె.మురళీకృష్ణ, హౌసింగ్ బోర్డు కాలనీ , తాడేపల్లిగూడెం

రోడ్డు విస్తరించాలి



బస్టాండ్ నుంచి గణేష్ నగర్ వరకూ రోడ్డు రద్దీగా ఉంటోంది. ఈ రోడ్డును రూరల్ గ్రామాలు వెళ్లేందుకు, ఏపీ నిట్, నన్నయ్య క్యాంపస్, క్రికెట్ స్టేడియానికి ఇదే ప్రధాన రహదారి. ఈ రోడ్డు విస్తరణ చేపడితే ఈ ప్రాంతంలో ప్రయాణించేవారికి ఇబ్బంది తీరడంతో పాటు ఎలాంటి ప్రమాదాలు లేకుండా నివారించవచ్చు.

- కళ్యాణం రామచంద్రరావు, గణేష్ నగర్, తాడేపల్లిగూడెం

కల్వర్టు నిర్మించండి



నూజివీడు ఎస్‌బీఐ సమీపంలో కల్వర్టు శిథిలమైంది. రద్దీగా ఉండే రహదారి కావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నడిచి వెళ్లేవారికి సైతం ఇబ్బందులు తప్పడం లేదు. మీకోసంలో ఫిర్యాదు చేసినా స్పందన లేదు. అధికా రులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

- అవిర్నేని వెంకటేశ్వరరావు, నూజివీడు

కోతుల బెడద తప్పించండి



పట్టణంలో కోతుల బెడద తీవ్రంగా ఉంది. ఆర్‌ఎంపీ వైద్యురాలిగా ఉన్న నా వద్దకు రోజుకు ఇద్దరు వైద్య చికిత్స కోసం వస్తున్నారు. కోతులు, కుక్కలు దాడుల కారణంగా ప్రజలు తీవ్ర గాయాలపాలవుతున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఈ సమస్యపై అధికారులు తక్షణం స్పందించి చర్యలు చేపట్టాలి.

- శివరాజు వసుంధరాదేవి, నూజివీడు

వీధి కుక్కల స్వైర విహారం



పట్టణంలో ఎక్కడ చూసినా వీధికుక్కలు పెరిగిపోయాయి. కుక్కల స్వైర విహారంతో పిల్లలను బయటకు పంపాలంటే భయపడే పరిస్థితి. కుక్కల నివారణకు చర్యలు చేపట్టాలి. నివారించాలి. వాటితోపాటు చిరంజీవి పార్క్‌లో పిచ్చి మొక్కలు అడవిలా పెరిగిపోయాయి. తుప్పల ను తొలగించే చర్యలు చేపట్టాలి.

- వి.నారాయణరాజు, వీకర్స్ కాలనీ, తాడేపల్లిగూడెం

సర్కిల్ ఏర్పాటు చేయాలి



బస్టాండ్ పక్క నుంచి గణేష్ నగర్ రోడ్డు, ఎస్వీఆర్ సర్కిల్ నుంచి గణేష్ నగర్ మీదుగా వెళ్లే రోడ్డు విస్తరించాలి. పక్కన ఉన్న చిన్న చిన్న రోడ్లు అనుసంధానం చేసి గణేష్ నగర్ వద్ద సర్కిల్ ఏర్పాటు చేస్తే ప్రజలకు ఏ దారిన వెళ్లే వారికైనా ఇబ్బంది లేకుండా ఉంటుంది. స్థానికంగా సమస్య పరిష్కారంపై దృష్టిపెట్టాలి.

- సిర్రా కొండలరావు, ఎఫ్‌సీఐ కాలనీ, తాడేపల్లిగూడెం

రహదారులు అధ్వానం



నూజివీడు పట్టణంలో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. పెద్ద గాంధీబొమ్మ సెంటర్ నుంచి బైపాస్ వరకు వెళ్లాలంటే నిత్యం నరకం కనిపిస్తోంది. వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రభుత్వం మారితే తమ పరిస్థితులు మారతాయని, ప్రజలు ఆశగా ఎదురుచూశారు. రహదారుల మరమ్మతులు చేపట్టాలి.

- ముమ్మనేని సునీల్, నూజివీడు

విజయవాడ జిల్లాలో కలపాలి



సార్వత్రిక ఎన్నికల సమయంలో నూజివీడు నియోజకవర్గాన్ని విజయవాడ జిల్లాలో కలుపుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. హామీ ప్రకారం నూజివీడును విజయవాడలో కలిపితే సీఆర్‌డీఏ పరిధితో నూజివీడు పట్టణం స్మార్ట్ సిటీగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

- మల్లిపూడి రాజశేఖర్, నూజివీడు

ముక్కలుగా సీసీ రోడ్డు!



మా 9వ వార్డులో గత ప్రభుత్వంలో 10 నెలల క్రితం సీసీ రోడ్డు ముక్కలుగా వేసి బిల్లు చేసుకున్నారు. ఆ రోడ్డు వల్ల ప్రజలకు ఇబ్బందే తప్ప ఉపయోగం లేదు. వెంటనే ఆ రోడ్డు సరిచేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలి. రోడ్డుకిరువైపులా బెర్మ్‌లు ఏర్పాటు చేస్తే వాహనాలు, సైకిళ్ల రాకపోకలకు అనువుగా ఉంటుంది.

- ఎం.దస్తగిరి, శేషమహల్ వీధి, తాడేపల్లిగూడెం

వాహనాలు శిథిలం



నూజివీడు మున్సిపల్ పరిధిలో వివిధ ప్రభుత్వ శాఖల వాహనాలు శిథిలమై నిరుపయోగంగా మారాయి. అనేక ప్రభుత్వస్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. హైడ్రాలో తీసుకున్న చర్యల్లా నూజివీడులోనూ అధికారులు కఠినంగా వ్యవహరించి చర్యలు చేపడితే తప్ప పరిస్థితి మెరుగుపడదు.

- విజయ్‌కుమార్, బాపూనగర్, నూజివీడు

అధికారుల నిర్లక్ష్యం



పట్టణంలో పారిశుధ్య దుస్థికి ప్రజల బాధ్యతారాహిత్యంతో పాటు అధికారుల నిర్లక్ష్యం కారణం. పారిశుధ్య నిర్వహణకు సచివాలయాల సిబ్బందిని సమర్థవంతంగా వినియోగించుకుని ప్రజల్లో అవగాహన కల్పిస్తే స్వచ్ఛ నూజివీడుగా తీర్చిదిద్దవచ్చు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రింగ్‌రోడ్డును ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- రామరాజు, గాంధీనగర్, నూజివీడు

కోతులతో ప్రాణాలు పోతున్నాయి



ఎంప్లాయిస్ కాలనీలో కోతుల దాడుల కారణంగా ప్రాణాలు పోతున్నాయి. బట్టలు ఆరవేసుకోవడానికి పైకి వెళ్లిన మహిళపై కోతులు దాడిచేయడంతో డాబా పైనుంచి పడి వెన్నుముక విరిగి జీవచ్ఛవంలా మారారు. పట్టణంలో కోతుల సంచారం నివారించి ప్రజల ప్రాణాలు కాపాడండి.

- వినయ్‌కుమార్, ఎంప్లాయిస్ కాలనీ, నూజివీడు

ప్రతిరోజూ తాగునీరు ఇవ్వండి



నూజివీడు మున్సిపల్ పరిధిలో రెండు రోజులకు ఒకసారి తాగు నీరు సరఫరా అవుతోంది. పట్టణ ప్రజలకు తాగునీటి తిప్పలు తప్పడం లేదు. వేసవిలో సమస్య మరింత తీవ్రం. పట్టణ ప్రజలకు ప్రతిరోజూ తాగునీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండాలి.

- రిమ్మనపూడి నాగమణి, గాంధీనగర్, మాజీ కౌన్సిలర్

వాగు ఆక్రమణలు తొలగించండి



నూజివీడు బస్టాండ్ సమీపంలో వాగు ఆక్రమణకు గురై చిన్న డ్రెయినేజి స్థాయిలో ఉండిపోయింది. పై నుంచి మూడు వాగులు కలిసి వస్తున్న సందర్భంలో వరదనీరు నూజివీడు బస్టాండు సమీప ప్రాంతాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఆక్రమణలు తొలగించి వాగును పునరుద్ధరించాలి.

- మోచర్ల నాగరాజు, 19వ వార్డు, నూజివీడు

సిబ్బంది ఏం చేస్తున్నారో



మున్సిపల్ పరిధిలో 115మంది కాంట్రాక్ట్, పారిశుధ్య కార్మికులతో పాటు మరో 30మంది కార్మికులు పనిచేస్తున్నారు. కాని వార్డులో ఒకరిద్దరికి మించి పనిచేస్తున్న దాఖలాలు లేవు. దేశంలో స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా మున్సిపాల్టీలకు నిర్మల్ పురస్కారాలను కేంద్రప్రభుత్వం ప్రకటిస్తుంటే నూజివీడు చివరిస్థానంలో నిలుస్తుందేమో.

- ముత్యాల కామేష్, గాంధీనగర్, నూజివీడు

టిడ్కో ఇళ్లు ఇవ్వండి



నూజివీడు ఎమ్మార్ అప్పారావు కాలనీలో టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వాలి. గత ప్రభుత్వం లబ్ధిదారుల పేరుతో రుణాలు పొందడంతో లబ్ధిదారులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. మంత్రి సారథి సంక్రాంతికి ఇళ్లు పూర్తిచేసి ఇస్తామన్నారు. త్వరగా ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వాలి.

- బోను అప్పారావు, 2వ వార్డు, నూజివీడు

ప్లాస్టిక్ వాడకం నిర్మూలించాలి



పట్టణంలో ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం అమలు కావడం లేదు. వివిధ వ్యాపార వర్గాలు డ్రెయిన్‌లో చెత్త వేస్తున్నాయి. అలాంటి పనులు చేసేవారిపై జరిమానా విధించాలి. పట్టణంలో పశువులను రహదారులపై వదిలివేస్తున్నారు. వారిని గుర్తించి అపరాధ రుసుము విధించటం, లేదా పశువులను సంరక్షణ కేంద్రాలకు తరలించటం చేయాలి.

- లక్ష్మిశ్రీనివాసరావు 24వ వార్డు, నూజివీడు

డ్రెయినేజీ శాఖలో సిబ్బంది లేరు

40 శాతం సిబ్బంది కొరత, లస్కర్లకు పది నెలలుగా జీతాలు లేవు : ఈఈ

ఆకివీడు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో డ్రైనేజీ శాఖలోని ప్రతీ సబ్ డివిజన్‌లో సిబ్బంది కొరత ఉందన్నారు. 40 శాతం సిబ్బంది లేరని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ సత్యనారాయణ తెలిపారు. ఆకివీడు కార్యాలయం వద్ద మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. లస్కర్లు కొరత త్రీవంగా ఉందని, ఔట్‌సోర్సింగ్ లస్కర్లకు సుమారు 10 నెలల నుంచి జీతాలు లేవన్నారు. జిల్లాలో 13 మేజర్, 56 మీడియం, 300 పైబడి మైనర్ డ్రెయిన్లు ఉన్నాయన్నారు. గత ఏడాది నవంబరులో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిధులు రూ.10కోట్లు విడుదలయ్యాయన్నారు. జిల్లాలో ఆకివీడు, తాడేపల్లిగూడెం, భీమవరం, పాలకొల్లు సబ్ డివిజన్లలో ముఖ్యమైన మట్టి తొలగింపు తదితర 39 పనులకు టెండర్లు వేయడం జరిగిందన్నారు. వీటిలో 17 పనులకు కాంట్రాక్టర్లు వచ్చారని, 7 పనులకు టెండర్ల ప్రాసెస్‌లో ఉన్నాయన్నారు. 15 పనులకు సంబంధించి ప్రతిపాదన లు పంపించడం జరిగిందన్నారు. వారంలో పనులు చేపట్టడం జరుగుతుందన్నారు.

జిల్లాలో మురుగు కాల్వల ఆక్రమణదారులకు గతంలో నోటీసులు ఇచ్చామని, మరలా ఇచ్చి చర్యలు చేపడతామన్నారు. ఉప్పుటేరుకు సంబంధించి ఆక్రమణలు గుర్తించి నోటీసులు జారీచేసి అభివృద్ధి కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారని, ఆ దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. నాబార్డు నిధులు రాబట్టడానికి ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. ఆకివీడు డివిజన్ పరిధిలో డీఈఈ వినోద్‌చంద్ర విధులకు సక్రమంగా రావడం లేదని ఫిర్యాదులు రావడం తో ఇటీవల మెమో ఇచ్చినా అతని తీరు మారలేదన్నారు. ఏఈఈ జీవీవీ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలి

ఆర్టీసీ గ్యారేజ్ వద్ద ఎన్‌ఎంయూ నిరసన

భీమవరం టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ భీమవరం గ్యారేజీలో మెకానిక్‌పై అక్రమ సస్పెషన్ వెంటనే ఎత్తివెయ్యాలని ఎన్ఎంయూ నేతలు డిమాండ్ చేశారు. గతంలో డీఎంకు ఇచ్చిన 33 సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ గ్యారేజీ వద్ద మంగళవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. మెకానిక్ అక్రమ సస్పెన్షన్‌పై నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా పాల్గొన్న రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పి.సోమరాజు, జిల్లా కార్యదర్శి వైవిరావు మాట్లాడుతూ ఎటువంటి సంబంధంలేని వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కండక్టర్‌ను పదే పదే విచారణకు రావాలని వేధించడం దారుణమన్నారు. గ్యారేజీలో మెకానిక్ రాజును అక్రమంగా సస్పెండ్‌చేశారని, వెంటనే రద్దుచేసి విధుల్లోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోకపోవటంతో మూడు రోజులు పాటు ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశామని, అయినా ఎటువంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి నిరసనగా గేట్ మీటింగ్‌లు ఏర్పాటు చేశామన్నారు. నాయకులు కట్టా రామారావు, సూర్యనారాయణ, ఏఎస్ఆర్ ప్రకాష్‌బాబు, మేళం నాగబాబు, ఎస్ రమేష్‌బాబు, నందు, బీవీఎస్‌రావు, నవీన్, మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.


ఆర్టీసీ గ్యారేజ్ వద్ద నిరసన వ్యక్తంచేస్తున్న ఎన్ఎంయూ నాయకులు

కోకో తోటల్లో సమగ్ర యాజమాన్యంతోనే లాభాలు

పెదవేగి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : కోకో తోటల్లో సమగ్ర యాజమాన్యంతో మరిన్ని లాభాలను అందుకోవచ్చని జిల్లా ఉద్యానశాఖాధికారి డాక్టర్ ఎస్.రామ్మోహన్ అన్నారు. కోకో తోటల నిర్వహణ, దిగుబడి, ధరల వ్యత్యాసాలపై బెంగళూరు ఐఐపీఎం బృందం వంగూరులోని కోకో తోటలను పరిశీలించి, రైతుల అనుభవాలు, ధర విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులను చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొబ్బరి, పామాయిల్ వంటి తోటల్లో అంతర పంటగా కోకో మేలైన దిగుబడినిచ్చి, రైతులను ఆర్థికంగా ఆదుకుంటోందన్నారు. కోకో తోటల నిర్వహణ, యాజమాన్యం విషయంలో రైతులు అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే ఆశించిన దిగుబడిని సాధించే వీలుంటుందన్నారు. కోకో గింజల నాణ్యతను పెంచుకునే దిశగా రైతులు చర్యలు తీసుకోవాలన్నారు. బెంగళూరు ఐఐపీఎం డైరెక్టర్ డాక్టర్ ఎస్.జాన్ మనోరాజ్ రైతులు తీసుకుంటున్న యాజమాన్యం వివరాలను తెలుసుకుని, మరింత మెరుగైన దిగుబడికి అనువుగా సూచనలు చేశారు. క్లిష్టమైన వాతావరణ పరిస్థితుల్లోనూ దిగుబడులను సాధించడానికి అవసరమైన సూచనలు చేశారు. ఐఐపీఎం శాస్త్రవేత్తలు డాక్టర్ కె.నరేంద్రన్, డాక్టర్ నబీ రసూల్, పెదవేగి మండల ఉద్యానశాఖాధికారిణి ఎం.రత్నమాల, రైతులు పాల్గొన్నారు.


కోకో తోటను పరిశీలిస్తున్న బెంగళూరు ఐఐపీఎం బృందం

ఫిబ్రవరి 2న కానూరులో ఏపీ స్టేట్ చెస్ టోర్నీ

ఏలూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ సమీపంలోని కానూరు స్కాట్‌స్పైన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఫిబ్రవరి 2న ఏపీ ప్రథమ స్టేట్ చెస్ టోర్నీ (కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు, గుంటూరు, ప్రకాశం) జిల్లాలకు జరుగుతుందని ఆంధ్ర చెస్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ మందుల రాజీవ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ టోర్నీలో మొదటి 20 మందికి నగదు బహుమతులను అందిస్తామని, ప్రతీ వయసు గ్రూపులో మొదటి మూడు స్థానాలకు ప్రత్యేక బహుమతులుంటాయన్నారు. టోర్నీలో పాల్గొనే వారు శనివారం సాయంత్రం ఆరుగంటల లోపు తమ పేర్లు, వివరాలను ఏపీ చెస్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 97007 75220, 924767 75566 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పాలిటెక్నిక్‌లో ప్రవేశాల కోసం ఐటీఐ ఉత్తీర్ణులకు బ్రిడ్జి కోర్సు

ఏలూరు అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఐటీఐ రెండేళ్ల కోర్సులు చదివి, 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులు నేరుగా పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరంలో చేరేందుకు అవసరమైన బ్రిడ్జి కోర్సు ఫిబ్రవరి 21 వరకు జిల్లాలో ఎంపిక చేసిన ప్రభుత్వ ఐటీఐలలో కొనసాగుతుందని ఏలూరు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ పి.రజిత తెలిపారు. శిక్షణ అనంతరం ఫిబ్రవరి 25, 26వ తేదీల్లో ఆయా సంస్థల్లో ప్రాక్టికల్ పరీక్షలు, తదుపరి రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రవేశ పరీక్షకు విద్యార్థులు హాజరు కావాలన్నారు. జిల్లాలో అర్హులైన విద్యార్థులు సమీప ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించాలని, వివరాలకు ప్రభుత్వ ఐటీఐ కార్యాలయం 08812-230269 నంబరులో తెలుసుకోవాలన్నారు.

కరాటే శిక్షణకు ఏజన్సీల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుతున్న బాలికలకు 'రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్షణ శిక్షణ' పేరిట ఫిబ్రవరి 1 నుంచి మార్చి 31 వరకు కరాటేలో శిక్షణ ఇచ్చేందుకు అర్హతలు గల ఏజన్సీల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ కె.పంకజ్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలు, జూనియర్ కళాశాలలు, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ విద్యాసంస్థల్లో బాలికలకు కరాటేలో శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకునే ఏజన్సీలు అందించే శిక్షకులు తప్పనిసరిగా మార్షల్ ఆర్ట్స్ లేదా ఆత్మరక్షణ విద్యలైన తైక్వాండో, కరాటే, జూడో, క్రావ్ మాగాలలో సర్టిఫికెట్ పొంది ఉండడంతోపాటు, తమ శిక్షణ సామర్థ్యాలను ప్రదర్శించాల్సి ఉంటుందన్నారు. కలెక్టర్ అధ్యక్షతన గల కమిటీ వీటిని పరిశీలించి, నిబంధనల మేరకు అధీకృత ఏజన్సీని నిర్ణయిస్తారన్నారు. మరిన్ని వివరాల కోసం డీఈవో ఏలూరు వెబ్ సైట్‌ను సందర్శించాలని కోరారు.

సివిల్ సప్లైలో ఉద్యోగాల పేరుతో ఘరానా మోసం

ద్వారకాతిరుమల, జనవరి 28(ఆంధ్రజ్యోతి): సివిల్‌సప్లైలో ఉద్యోగాలు ఇప్పిస్తామని ఇద్దరి నుంచి ఓ వ్యక్తి డబ్బులు దండుకుని ఫేక్ ఆర్డర్లు ఇచ్చి మోసం చేసినందుకు కటకటాల పాలయ్యాడు. ఎస్‌ఐ టి.సుధీర్ తెలిపిన వివరాలివి.. మండలంలోని రామన్నగూడెంకు చెందిన కుక్కల నాగమల్లేశ్వరరావు, పాల నాగార్జునలకు జి.కొత్తపల్లికి చెందిన బిరుదుగడ్డ బజారయ్య అనే వ్యక్తి సివిల్ సప్లైలో అటెండర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని ఆగస్టు, 2023లో ఒక్కొక్కరి వద్ద రూ.2.50లక్షలు వసూలు చసి ఫేక్ ఆర్డర్లు అందించి మోసగించాడు. దీనిపై కేసు నమోదు చేసి మంగళవారం బజారయ్యను అరెస్ట్ చేసి కోర్టుకు పంపామని 14 రోజులు జ్యుడీషియల్ కస్టడీ విధించారని తెలిపారు.

టి.నరసాపురం పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

టి.నరసాపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): టి.నరసాపురం పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణను ఉన్నతాధికారులు మంగళవారం సస్పెండ్ చేశారు. గతనెల 29న తెలుగుదేశం పార్టీ నాయకుడు పెద్దిన చంద్రశేఖర్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు మరణ ధ్రువపత్రం కోసం సచివాలయంలో దరఖాస్తు చేశారు. ఆ మరణ ధ్రువపత్రం మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బొమ్మ ఉన్న ధ్రువపత్రాన్ని డేటా ఎంట్రీ ఆపరేటర్ ఇచ్చారు. ఈ విషయం టీడీపీ నాయకులు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాలతో కార్యదర్శి లక్ష్మీ నారాయణతో పాటు డేటా ఎంట్రీ ఆపరేటర్ కుమారిని విధుల నుంచి తొలగించారు.

భక్తుల అభిప్రాయాలు తెలిపేందుకు క్యూఆర్ కోడ్

ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రంలో దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశంతో ఏర్పాటు

ద్వారకాతిరుమల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఏడు ప్రధాన ఆలయాల్లో భక్తులకు అందే సౌకర్యాలు, దర్శన అనుభవాన్ని తెలుసుకునేందుకు క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేశారు. దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఆదేశాల మేరకు ఆలయ దర్శనంపై సర్వేలో భాగంగా ద్వారకాతిరుమల, విజయవాడ, అన్నవరం, సింహాచలం, కాణిపాకం, శ్రీకాళహస్తి, శ్రీశైలం ఆలయాల్లో ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలోనే ద్వారకాతిరుమల దేవాలయ పరిసరాల్లో ఈ క్యూఆర్ కోడ్ దర్శనమిస్తోంది. ఆలయానికి వచ్చిన భక్తులు ఈ కోడ్‌ను వినియోగించుకుని తమకు దర్శనం ఎలా జరిగింది, ఇతర వసతులు, సౌకర్యాలపై తమ అభిప్రాయాన్ని, పేరు, ఫోన్ నంబరు నమోదు చేసి సబ్మిట్ చేయాలి.




పిట్టలోళ్ల గుడిసెల దగ్ధం ఘటనలో మరో ముగ్గురి మృతి

మండవల్లి జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండవల్లి మండలం భైరవపట్నంలో ఈనెల 24వ తేదీ రాత్రి పిట్టలోళ్ల గుడిసెల దగ్ధం ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న క్షతగాత్రులు ఇప్పటివరకు మొత్తం నలుగురు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. మంగళవారం ఉదయం ముగ్గురు మరణించారని డబ్బా పాప అలియాస్ అను(20) గుంటూరు జీజీహెచ్ హాస్పిటల్లో చికిత్స పొందుతూ మృతి చెందగా, నక్కల చరణ్(19), కార్తీక్(17)ను తమిళనాడు వేలూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఇప్పటికే ఈ ఘటనలో గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మూడేళ్ల చిన్నారి విక్కీ మృతి చెందిన విషయం తెలిసిందే. ఒకే కుటుంబానికి చెందిన మొత్తం ఆరుగురు అగ్నిప్రమాద బాధితులు ఒక్కొక్కరిగా మృతి చెందడంతో బంధువులతో పాటు భైరవపట్నంలోని గ్రామస్థులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. క్షతగాత్రులు మిగిలిన ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో భైరవపట్నంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మండవల్లి ఎస్‌ఐ రామచంద్రరావు సిబ్బందితో పాటు గుంటూరు హాస్పిటల్‌కి వెళ్లి మృతురాలు అను మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

31న సీఎం చంద్రబాబు పెనుగొండ రాక

- వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవానికి హాజరు
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ, జేసీ తదితరులు




పెనుగొండ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీ తదితరులు


వాసవీ ధామ్‌లో కలెక్టర్, ఎస్పీ తదితరులు

పెనుగొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పెనుగొండ శ్రీనగరేశ్వర స్వామి మహిషాసుర మర్దని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈనెల 31న నిర్వహించే వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొననున్నారు. సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లలో భాగంగా మంగళవారం పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్పీ నయీమ్ అస్మి, జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి పెనుగొండలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో హెలీప్యాడ్ స్థలాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అనంతరం నగరేశ్వర మహిషాసుర మర్దని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కలెక్టర్, ఎస్పీ, జేసీలకు శేషవస్త్రాలను కప్పి ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వచనాలు పలికారు. ఆలయాన్ని పరిశీలించిన అనంతరం నిత్యాన్నదాన సత్రం ప్రాంగణంలో ఈనెల 31న హోమం నిర్వహించే ప్రాంతాన్ని పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. వాసవి ధామ్‌ను సందర్శించి 90 అడుగులు కన్యకాపరమేశ్వరి అమ్మవారి పంచలోహ విగ్రహాన్ని దర్శించుకున్నారు. ఆలయ సెక్రటరీతో కార్యక్రమాల వివరాలు చర్చించి సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ బి.భీమారావు, ఆర్‌డీవో దాసిరాజు, డీఎస్పీ డాక్టర్ శ్రీవేద, దేవస్థానం అధికారి ఐవీ సుబ్బారావు, తహసీల్దార్ అనిత కుమారి, ఎంపీడీవో మూర్తి, వాసవీధామ్ సెక్రటరీ కె.రాజు, సీఐ ఆర్.విజయ కుమార్, ఎస్‌ఐ గంగాధర్, ఆర్‌అండ్‌బీ అధికారులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అవార్డు గ్రహీత గౌరీపార్వతికి అభినందనలు


గౌరీపార్వతి

తాడేపల్లిగూడెం రూరల్ జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం పట్టణంలోని 17వ వార్డు అంగన్‌వాడీ కార్యకర్త గౌరీ పార్వతికి గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ స్థాయి అవార్డు లభించింది. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఢిల్లీలోని కేంద్ర మంత్రి చేతుల మీదుగా ఆమె అవార్డు స్వీకరించారు. ఈ సం దర్భంగా ఆమెను తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, సీడీపీవో టీఎల్ సరస్వతి, సూపర్‌వైజర్ దుర్గాభవాని తదితరులు అభినందించారు.

రేపు శాంతి ప్రదర్శనలు

ఏలూరు అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ 77వ వర్థంతి పురస్కరించుకుని ఉమ్మడి జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో ఈనెల 30న గాంధీ మండపాల వద్ద శాంతి ప్రదర్శనలు, సర్వమత ప్రార్థనలు నిర్వహిస్తున్నట్టు మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు ఓ ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు, గాంధేయవాదులు పాల్గొనాలని కోరారు.

ఊడ్చిన 20 రోజుల లోపే ఎరువులు వేయాలి

పెనుగొండ, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : ఊడ్చిన ఇరవై రోజులలోపే ఎరువులు వేయాలని, తరువాత కాంప్లెక్స్ ఎరువులు వాడకూడదని మార్టేరు శాస్త్రవేత్తలు సూచించారు. మండలంలోని ములపర్రు, కొఠాలపర్రు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం శాస్త్రవేత్తల బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ములపర్రు గ్రామంలోని వరి పొలాల్లో నీరు ఎక్కువగా ఉందని చేలల్లో నీటిని తొలగించి చేలు మూన తిరిగాక చిలామిన్ జింక్ లేదా లాబ్‌జింక్ రెండు గ్రాముల నీటిలో కలిపి వారం రోజులు వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలని శాస్త్రవేత్త ఎస్. దయాకర్ సూచించారు. మరో శాస్త్రవేత్త పీవీ రమేష్ బాబు మాట్లాడుతూ నత్రజని ఎరువులను అధికంగా వినియోగించడం వల్ల పురుగులు, తెగుళ్ళ ఉధృతి ఎక్కువగా ఉంటుందన్నారు. ఏవో పి.స్పందన మాట్లాడుతూ ఎంటీయూ 1121 ఊడ్చిన వరి చేలల్లో దుబ్బు కుళ్ళినట్లుగా కనిపిస్తున్నట్లైతే ఎండాకు తెగులు ఆశించినట్టుగా రైతులు గుర్తించాలన్నారు. దీని నివారణకు ప్లాంటమైసిన్ 120 గ్రాములు ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. వ్యవసాయ సహాయకులు కె.సంధ్య, పి. సురేంద్రకుమార్, రైతులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్ పరీక్షలు

భీమవరంరూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : భీమవరం పట్టణంలోని డీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో మంగళవారం జేఈఈ మెయిన్స్-2025 సెషన్-1 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం, మధ్యాహ్నం రెండు సెక్షన్‌లుగా పరీక్షలు నిర్వహించారు. మొదటి సెక్షన్‌లో 100 మంది విద్యార్థులకు గాను, 99 మంది హాజరైయ్యారు. రెండో సెక్షన్‌లో 99 మంది విద్యార్థులకు గాను 96 మంది హాజరయ్యారు.

ఐదు రకాల బడులకు కసరత్తు పూర్తి

- ఇప్పుడున్న పాఠశాలల్లో ఒక్కటీ మూసివేత లేకుండానే కొత్త బడులతో బలోపేతం
- ఇక ఐదు తరగతులూ ఒకేచోట
- పాఠశాల విద్యలో కొత్త ఒరవడి

ఏలూరు అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఆరు బడుల విధానం స్థానే వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించ తలపెట్టిన ఐదు రకాల బడులపై ఏలూరు జిల్లాకు సంబంధించి కసరత్తు దాదాపు పూర్తయింది. ఇపుడున్న పాఠశాలలను పునర్వ్యవస్థీకరించి ఐదు రకాల బడులను క్లస్టర్ పరిధిలో పంచాయతీని యూనిట్‌గా తీసుకుని ప్రారంభిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన విషయం విదితమే. ఆ ప్రకారం జిల్లాలో ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలలు 1,243, ప్రాథమికోన్నత పాఠశాలలు 164, ఉన్నతపాఠశాలలు 202 ప్రభుత్వవిద్యారంగంలో నడుస్తున్నాయి. వీటిని క్లస్టర్‌స్థాయిలో పంచాయతీల్లో స్థానిక పాఠశాలల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్, సౌకర్యాలు, స్థానిక అవసరాల ప్రాతిపదికన డీవైఈవోలు, ఎంఈవోల నుంచి సమాచారాన్ని రప్పించుకుని క్రోడీకరించడం ద్వారా ఐదు రకాల బడులుగా పునర్వ్యవస్థీకరించడానికి ప్రతిపాదించారు. ఆ ప్రకారం జిల్లాలో ఇప్పుడు నడుస్తున్న పాఠశాలల్లో ఏ ఒక్కదానిని మూసివేసే ప్రసక్తి లేకుండా మ్యాపింగ్ చేశారు. దీనికనుగుణంగా జిల్లాలోని 592 పంచాయతీల్లో సుమారు 310 మోడల్ ప్రైమరీ స్కూళ్లను ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు బోధించేలా వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రారంభించనున్నారు. అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేస్తున్న మోడల్ ప్రైమరీ స్కూళ్లలోకి ఆయా ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువ కారణంగా 3, 4, 5 తరగతులను విలీనం చేయనున్న సంగతి విదితమే. ఇక ఎల్‌కేజీ, యూకేజీలతోపాటు ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఉండేలా బేసిక్ ప్రైమరీ స్కూళ్ళు సుమారు 900 వరకు ఉండవచ్చు. తగినంత మంది విద్యార్థులసంఖ్య లేనప్పటికీ హైవేలు, చెరువులు, తదితర అడ్డంకుల కారణంగా ప్రాథమిక తరగతుల విలీనానికి వీలులేని చోట్ల బేసిక్ ప్రైమరీ స్కూళ్లను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించిన విషయం తెలిసిందే. ఎల్‌కేజీ, యూకేజీలతో ఒకటి, రెండు తరగతులతో నడిచే ఫౌండేషనల్ స్కూళ్ళు సుమారు 246 వరకు ప్రారంభంకానున్నాయి.

- ఇప్పటివరకు కొనసాగుతున్న ప్రాథమికోన్నత పాఠశాలలు, ఇంటర్‌విద్యతో ఉన్నత పాఠశాలల్లో నడుస్తున్న హైస్కూల్ ప్లస్‌లు నూతన విద్యావిధానంలో ఉండబోవని ప్రభుత్వం ఇప్పటికే సంకేతాలిచ్చింది. ప్రస్తుతం మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు బోధిస్తోన్న 202 హైస్కూళ్ళన్నింటినీ ఐదు రకాల బడుల విధానంలోనూ కొనసాగిస్తూనే పూర్వపు విధానంలో వున్న విధంగా 6 నుంచి 10వ తరగతి వరకు బోధించేందుకు మాత్రమే వీటిని పరిమితం చేయనున్నారు. పునర్వ్యవస్థీకరణతో ఎస్జీటీ కేడర్ ఉపాధ్యాయులందరికీ మిగులు, సర్దుబాటు సమస్య దాదాపుగా ఉండకపోవచ్చనే సంకేతాలు వస్తున్నాయి. ఈ సమస్యలు స్కూల్ అసిస్టెంట్ కేడర్ టీచర్లకు ఎదురయ్యే అవకాశాలుంటాయని భావిస్తున్నారు.
- జిల్లాలో ఐదు రకాల బడులపై క్రోడీకరించిన వివరాలపై మంగళవారం పాఠశాల విద్య డైరెక్టర్ వీడియో కాన్ఫరెన్సుద్వారా సమీక్షించగా, తుది నివేదికను కలెక్టర్ పరిశీలన, ఆమోదం నిమిత్తం జిల్లా విద్యాశాఖ సమర్పించింది. నూతన విధానం ద్వారా పంచాయతీల వారీగా పునర్వ్యవస్థీకరణపై స్థానిక ఎమ్మెల్యేలకు నియోజకవర్గాల ప్రత్యేకాధికారులు కొద్దిరోజుల్లో నివేదించనున్నారు.

ఆకట్టుకున్న సినీ మ్యూజికల్ నైట్

భీమవరంటౌన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : మావుళ్ళమ్మ అమ్మవారి వార్షిక మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి కొటికలపూడి గోవిందరావు కళావేదికపై మచిలీపట్నంకు చెందిన పాండురంగ సినీ మ్యూజికల్ నైట్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆర్గనైజర్ సీహెచ్ నికిలేష్ ఆధ్వర్యంలో గాయకులు పలు చిత్రాల్లోని పాటలను మూడు గంటల పాటు పాడి రంజింపచేశారు. మధ్యాహ్నం పన్నెండు గంటలకు శృంగవృక్షానికి చెందిన పద్మాలమ్మ మురళీ కోలాటం వారిచే కోటాటం, సాయంత్రం మూడు గంటలకు కటికి శ్రీదేవి ఆధ్వర్యంలో భజన, సాయంత్రం నాలుగు గంటలకు తాడేపల్లిగూడెంకు చెందిన శ్రీనటరాజా డ్యాన్స్ అకాడమి వారిచే కూచిపూడి జానపద నృత్య ప్రదర్శన, రాత్రి తొమ్మిది గంటలకు విజయవాడకు చెందిన వారిచే సత్యహరిశ్చంద్ర ఏకపాత్ర జరిగాయి. అనంతరం సంపత్‌నగర్‌కు చెందిన శ్రీబాల సరస్వతీ నాట్యమండలి వారిచే శ్రీరామాంజనేయ యుద్ధం నాటకం ప్రదర్శించారు.


సినీగీతాలను ఆలపిస్తున్న గాయకులు

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ఏలూరు క్రైం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయం చేయడానికి చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లింగపాలెం మండలం అయ్యప్పరాజుగూడెం గ్రామానికి చెందిన బొల్లవరపు ప్రకాష్‌బాబు(50)కు భార్య ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వ్యవసాయం చేసేందుకు అనేక అప్పులు చేసి అవి తీర్చే మార్గం కానరాక మంగళవారం మధ్యాహ్నం పురుగుల మందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

ముగ్గురు దొంగల అరెస్ట్

- రూ.13.38 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, ఐదు బైక్‌ల స్వాధీనం

భీమవరంటౌన్, జనవరి (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనాలకు పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 13 లక్షల 38 వేల రూపాయల బంగారు ఆభణాలు, ఐదు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నామని పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. భీమవరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో మంగళవారం విలేకర్ల సమావేశంలో వివరాలు తెలిపారు. కాళ్ల మండలం సీసలిలోని ముగ్గళ్ల నర్సింహారావు ఇంటిలో దొంగతనానికి పాల్పడిన అత్తిలి మండలం ఉరదాళ్లపాలెంకు చెందిన జొన్నల వెంకటేష్, కాళ్ల మండలం బొండాడపేటకు చెందిన ఆకురాతి జోష్ణదేవితోపాటు భీమవరంలోని అట్టిక గోల్డ్ కంపెనీలో పనిచేస్తున్న పాలకొల్లుకు చెందిన గొర్రెల కృష్ణలను అరెస్టు చేశామన్నారు. నిందితులను ఆకివీడు సీఐ వి.జగదీశ్వరరావు, ఎస్‌ఐ నాళం శ్రీనివాసరావు విచారించగా జొన్నల వెంకటేష్, ఆకురాతి జోష్ణదేవి జిల్లాలోని ఉండి, పెంటపాడు, తణుకు రూరల్, తాడేపల్లిగూడెం రూరల్, ఏలూరు జిల్లాలోని లక్కవరం, తూర్పుగోదావరి జిల్లాలోని నల్లజర్ల ప్రాంతంలో బంగారు గొలుసులు దొంగతనాలకు పాల్పడ్డామని తెలిపారన్నారు. కాళ్ళ, ఉండ్రాజవరం, ముదినేపల్లి పరిధిలో మోటారు సైకిళ్లను దొంగతనం చేశారన్నారు. జొన్నల వెంకటేష్ ఆటోలు, బస్సులు కోసం ఒంటరిగా వేచి ఉన్న వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుని వారికి మోటారు సైకిల్‌పై లిఫ్ట్ ఇచ్చి వారి మెడల్లోని బంగారు ఆభరణాలు దొంగిలించే వాడన్నారు. నిందితులు వెంకటేశ్ బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ.70 వేలు. జోష్ణదేవి ఖాతాలో రూ.1.80 లక్షలు సీజ్ చేశామన్నారు. ఈ కేసులో అట్టిక గోల్డ్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సివుందన్నారు. కేసును ఛేదించిన సీఐ జగదీశ్వరరావు, ఎస్‌ఐ శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లను అభినందించి నగదు రివార్డులను అందించారు. సమావేశంలో డీఎస్పీ ఆర్.జయసూర్య, ఆకివీడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జగదీశ్వరరావు, ఎస్‌ఐ ఎన్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అస్మి, అధికారులు

చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి

అత్తిలి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : రుణ బాధలు తట్టుకోలేక పురుగుల మందు తాగిన కౌలురైతు మృతిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పి.ప్రేమరాజు మంగళవారం తెలిపారు. అత్తిలి మండలం ఉనికిలి గ్రామానికి చెందిన చల్లాది ఈశ్వరరావు (43) కొంతకాలంగా కంచుమర్రు గ్రామంలో నివశిస్తూ కౌలుకు వ్యవసాయం చేస్తున్నాడు. మూడేళ్ళుగా వ్యవసాయంలో నష్టం రావడంతో ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఈనెల 27న ఈర్లకోడుపుంతలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని స్థానిక రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సత్వరమే 108 వాహనంలో తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు మృతుడి భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

కిడ్నీ సమస్యతో ఆసుపత్రిలో ఒకరి మృతి

ప్రైవేట్ ఆసుపత్రి వద్ద బంధువుల ఆందోళన

పాలకొల్లు అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఒక వ్యక్తి మరణించిన ఘటన మంగళవారం జరిగింది. మరణించిన వ్యక్తి బంధువులు తెలిపిన వివరాలివి.. నరసాపురం రాయపేటకు చెందిన ఎస్.ప్రభాకర్ (35) కిడ్నీ సమస్యతో తొమ్మిది రోజుల క్రితం ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు ఈ నేపథ్యంలో రెండు రోజుల నుంచి అతడి ఆరోగ్యం ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన వైద్యచికిత్స నిమిత్తం మరో ఆసుపత్రికి తీసుకువెళతామని చెప్పినప్పటికీ ఆసుపత్రి యాజమాన్యం అంగీకరించకుండా, పరవాలేదు వ్యాధి నయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆసుపత్రిలోనే అతడిని ఉంచామని, అయితే మంగళవారం మరణించాడు. ఈ మేరకు ప్రభాకర్ బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. ఆసుపత్రి యాజమాన్యం, మృతిడి బంధువులు, పెద్దలతో కలిసి రాజీ కుదుర్చుకున్నట్టు సమాచారం, దీనిపై ఏవిధమైన కేసు నమోదు కాలేదని పట్టణ ఎస్‌ఐ జి.పృథ్వీ తెలిపారు.


ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతుడు ప్రభాకర్ బంధు, మిత్రులు

విద్యార్థినిపై ఉపాధ్యాయుడి అనుచిత ప్రవర్తన

- హైస్కూల్‌లో టీచర్ తీరుపై డీవైఈవో విచారణ

కైకలూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పదో తరగతి చదువుతున్న విద్యార్థినిని పెళ్లి చేసుకుంటానంటూ ఓ ఉపాధ్యాయుడు అనుచితంగా ప్రవర్తిస్తున్న ఘటనపై కైకలూరు మండలంలో ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. వివరాలివి.. మండలంలోని ఓ జిల్లా పరిషత్ హైస్కూల్లో చదువుతున్న విద్యార్థినిని అదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు పెళ్లి చేసుకుంటానని ఇటీవల సంక్రాంతి సెలవుల్లో బాలిక కుటుంబ సభ్యుల దృష్టికి తీసుకువెళ్లాడు. వారి కుటుంబసభ్యులు ఉపాధ్యాయుడితో వాగ్వాదానికి దిగి అతడి తీరుపై హెచ్‌ఎంకు ఫిర్యాదు చేశారు. హెచ్‌ఎం జిల్లా విద్యాశాఖాధికారికి ఫిర్యాదు చేయగా ఈ మేరకు ఏలూరు డీవైఈవో రవిప్రకాష్ మంగళవారం స్కూల్లో విచారణ చేపట్టారు. ఆ విద్యార్థినితో పాటు పలువురు విద్యార్థినులను, ఉపాధ్యాయులను వేర్వేరుగా విచారణ చేశారు. గతంలో ఆ ఉపాధ్యాయుడు పనిచేసిన పాఠశాలల్లో అనేక ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. పనిష్మెంట్‌పై అప్పటి ఉన్నతాధికారులు వేర్వేరు ప్రదేశాలకు బదిలీలు చేసినట్టు డీవైఈవో తెలిపారు. ప్రస్తుతం ఆ ఉపాధ్యాయుడు ఈనెల 18వ తేదీ నుంచి మెడికల్ లీవ్‌లో ఉన్నాడని అయినా విచారణకు రావాలని ఆదేశించడంతో హాజరయ్యాడన్నారు. విద్యార్థిని బంధువులు, తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇచ్చిన సమా చారం మేరకు పూర్తిస్థాయి నివేదికను డీఈవోకు అందజేస్తామని డీవైఈవో తెలిపారు.


పాఠశాలలో విచారణ జరుపుతున్న డీవైఈవో రవిప్రకాశ్, తదితరులు

దోసపాడులో ఉచిత పశు వైద్య శిబిరం

దెందులూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి) :పాడి రైతుల ఆర్థిక ప్రగతికి పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నామని దెందులూరు మండల పశు వైద్యశాఖ అధికారి డాక్టర్ కె.రామమోహన్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని దోసపాడ గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామ్మోహన్‌రావు మాట్లాడుతూ అనారోగ్యంతో ఉన్న పశువులకు, జీవాలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు. పోతునూరుతో పాటు ఉంద్రాజవరం, దోసపాడు పాడి పశువుల రైతులు పెద్ద ఎత్తున శిబిరంలో పాల్గొని పశువులకు వైద్య పరీక్షలు చేయించారు.

రూ.12.40 కోట్ల జడ్పీ నిధులతో అభివృద్ధి పనులు

పెదపాడు, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : పెదపాడు మండలంలో రూ.12.40 కోట్ల జడ్పీ నిధులతో వివిధ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. పెదపాడు ఎంపీడీవో కార్యాలయం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో పద్మశ్రీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి బాటలో నడుస్తోందన్నారు. జడ్పీ నుంచి మండలంలో 191 వివిధ పనులను గుర్తించి నిధులు మంజూరు చేయగా, వాటిలో 108 పనులు పూర్తయ్యాయని తెలిపారు. రానున్న వేసవిలో నీటిఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

పునుకొల్లులో చీడపీడలపై రైతులకు అవగాహన

పెదపాడు, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : అపరాల సాగు చేపట్టిన రైతులు పంటలకు ఆశించే చీడపీడలపై అవగాహన కలిగి ఉండాలని పెదపాడు మండల వ్యవసాయాధికారి వి.ప్రదీప్ కుమార్ తెలిపారు. పునుకొల్లులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించి స్థానిక రైతులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించారు. చీడపీడల నివారణా చర్యలు, భూసార పరీక్షలపై ఉంటే మంచి దిగుబడులు పొందవచ్చని తెలిపారు.

ప్రభుత్వ పథకానికి పొట్టి శ్రీరాములు పేరు పెట్టాలి


సీఎం చంద్రబాబుకు వినతి పత్రం అందజేస్తున్న తిరువీధి వేణు గోపాల్

ఏలూరు రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో ఒకదానికి అమరజీవి పొట్టిశ్రీరాములు పేరు పెట్టాలని కోరుతూ వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ అధ్యక్షుడు తిరువీధి వేణు గోపాల్ సీఎం చంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ డ్యూటీ రాకేష్‌తో కలిసి చంద్రబాబును కలిసినట్లు తెలిపారు. శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆత్మార్పణరోజును అధికా రికంగా నిర్వహించాలని నిర్ణయిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం శుభ పరిణామం అని అన్నారు. ఈ నెల 31వ తేదీన జరిగే అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆర్యవైశ్యులు విజయవంతం చేయాలని వేణుగోపాల్ పిలుపునిచ్చారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి : జడ్పీ చైర్మన్

పెదపాడు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. పెదపాడు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ బత్తుల రత్న కుమారి అధ్యక్షతన గ్రామాల అభివృద్ధిపై గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అమీల్ జమ, ఇవోపీఆర్డీ సూర్యకుమార్, సర్పంచ్‌లు పొట్లూరి యుగంధర్, ఎల్.హేమసుందర్, మరీదు రెడ్డియ్య, ఎంపీటీసీ రంభా నాగరాజు పాల్గొన్నారు.

స్పీకర్ అయ్యన్న పాత్రుడి వ్యాఖ్యలపై అసహనం

బుట్టాయగూడెం, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీ ప్రాంతంలోని 1/70 చట్టం జోలికొస్తే సహించేదిలేదని ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హెచ్చరించారు. మంగళవారం విలేకరులతో సమావేశంలో సంఘ నాయకులు మాట్లాడుతూ గిరిజన చట్టాలపై అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. గిరిజన చట్టం సవరణ తోనే ఏజెన్సీలో పెట్టుబడులు వస్తాయనడం సరికాదన్నారు. స్పీకర్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'దళిత టీచర్లను టార్గెట్ చేయడం సరికాదు'

ఏలూరు అర్బన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ టీచర్లనే టార్గెట్‌గా చేస్తూ సస్పెన్షన్లు విధిస్తూ ఆధిపత్య సామాజిక వర్గానికి కొమ్ముకాస్తున్న జిల్లా విద్యాశాఖ తీరుపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని సమతా సైనికదళ్ రాష్ట్ర అధ్యక్షుడు బేతాళ సుదర్శనం డిమాండ్ చేశారు. ఉద్యోగ జీవితంలో ఏదైనా పొరపాటు జరిగితే నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన జిల్లా విద్యాశాఖ దానికి భిన్నంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఆర్డీవో స్థాయి అధికారులతో విచారణ చేయించి వాస్తవాలు బయటకు తీయాలని అన్నారు.

పేదల సొంతింటి కలను నెరవేరుస్తాం : ఎమ్మెల్యే

ఏలూరు టూటౌన్, జనవరి28(ఆంధ్రజ్యోతి) :పేదల సొంతింటికలను నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న కాలనీ పేరుతో వైసీపీ ప్రభుత్వం మహిళల్ని దారుణంగా మోసం చేసిందన్నారు. వైసీపీ ప్రజా ప్రతినిధుల అసమర్థత వల్ల ఆ కాలనీలు గృహనిర్మాణాలకు నోచుకోకుండా అర్ధంతరంగా నిలిచిపోయాయని అన్నారు.పేదల ఆశలకు అనుగుణంగా అర్హులైన ప్రతి ఈపేదవానికి సొంతింటికలను సహకారం చేస్తామన్నారు. ఎవ్వరూ అధైర్యపడొద్దని సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. చల్లా సత్యవర ప్రసాద్, బెల్లకొండల కిషోర్, పెద్దిబోయిన శివప్రసాద్, చోడే వెంకట రత్నం, వందనాల శ్రీనివాస్, ఆర్నేపల్లి తిరుపతి, పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి సన్నిధిలో అన్నదానం

ఏలూరు కార్పొరేషన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : స్థానిక కోటదిబ్బ వద్ద ఉన్న గణపతి త్రిదేవి పీఠం ప్రాంగణంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద మంగళవారం ఆలయ ధర్మకర్త చిందా రాజు భక్తులకు మహా అన్నసమారాధనను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. అదే విధంగా పాండురంగ సెంటర్‌లోని దాసాంజనేయ స్వామి అలయ ధర్మకర్త రెళ్ళ రామకృష్ణ ఆధ్వర్యంలో 603 మందికి మహా అన్నసమారాధనను నిర్వహించారు.

ఉత్సాహంగా అపుస్మా జిల్లా స్థాయి క్రీడలు

ఏలూరు రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): అపుస్మా ఏలూరు జిల్లా ఇంటర్ జోనల్ గేమ్స్, స్పోర్ట్స్ మీట్ మంగళవారం ఏలూరు అల్లూరి సీతారామ రాజు స్టేడియంలో ఉత్సాహంగా జరిగింది. జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. డీఎస్‌పి చీఫ్ కోచ్ డి.శ్రీనివాసరావు క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో ఏలూరు, దెందులూరు, చింతలపూడి, జంగారెడ్డి గూడెం,ఉంగుటూరు ప్రైవేట్ స్కూల్స్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అపుస్మా సంఘ నాయకులు పాల్గొన్నారు.

దళితుల అర్జీలపై నిర్లక్ష్యం వీడండి : కేవీపీఎస్

ఏలూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం డివిజన్ స్థాయిలోని ప్రభుత్వ కార్యాయాల్లో ఎస్సీలు పెట్టుకున్న అర్జీలు పరిష్కారం కాకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎ. ఫ్రాన్సిస్ ఆరోపించారు. పట్టణంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో కమిటీ సమావేశం పల్లి రాజు అధ్యక్షతన మంగళవారం జరిగింది. జీలుగుమిల్లి నుంచి పోలవరం వరకు మంజూరైన జాతీయ రహదారి రెండో సర్వే ఎస్సీల ఇళ్ళ పైకి మార్చారని ఆరోపించారు. దీనిపై మరోసారి పునరాలోచించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మనెల్లి నాగేశ్వరరావు, ముప్పిడి ఏసు, ఎం. వెంకటరావు, సుబ్బారావు, మరియమ్మ పాల్గొన్నారు.

గూటాల, కొత్త పట్టిసీమ గ్రామాల్లో పొలం పిలుస్తోంది

తెగుళ్ల నివారణకు అధికారులను సంప్రదించాలని సూచన

ఏలూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : పోలవరం మండలం గూటాల కొత్త పట్టిసీమ గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖాధికారి కె.రాంబాబు మాట్లాడుతూ మండలంలో కొత్తపట్టిసీమ, గూటాల గ్రామాల పరిధిలో తెగుళ్ల నివారణకు ప్రణాళికలు సూచించారు. రైతులు వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటలను కాపాడుకోవాలని సూచించారు. రైతులు సలహాలు, సూచనల కోసం మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో సచివాలయ వ్యవసాయి సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

టెన్త్ విద్యార్థులంతా ఉత్తీర్ణత సాధించాలి

అధికారులకు దిశానిర్దేశం చేసిన ఐటీడీఏ పీవో రాములు నాయక్


సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో రాములు

బుట్టాయగూడెం, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా కె.ఆర్. పురం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులంతా ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని ఐటీడీఏ పీవో, ఆర్అండ్ఆర్ ఆఫీసర్ కె.రాములు నాయక్ అధికారులకు సూచించారు. మంగళవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల హెచ్ఎంలు, వసతి గృహాల వార్డెన్‌లు, ఎటిడబ్ల్యువోలు, విద్యాశాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పీవోగా బాధ్యతలు చేపట్టాక పీవో మొదటిసారి విద్యాశాఖాధికారులతో సమీక్ష చేశారు. ఇప్పటి నుంచే 10వ తరగతిలోని ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని గుర్తించి పరీక్షలకు అవసరమైన శిక్షణ ఇవ్వాలన్నారు. గత పరీక్షల్లో వచ్చిన మార్కులు ఆధారంగా విద్యార్థులను వేరుచేసి వెనుకబడినవారికి అవసరమైతే వసతి గృహాల్లో కూడా రాత్రిపూట తరగతులు నిర్వహించాలని సూచించారు. అలాగే విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా మెనును సక్రమంగా పాటించాలని సూచించారు. రాత్రిపూట తరగతుల్లో అల్పాహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో, ఇన్‌చార్జీ డీడీ వీవీఎస్ నాయుడు, ఐటీడీఏ ఇఇ లత, డీవైఈవో రామ్మోహనరావు, ఏఎంవో కె.శిరమయ్య, జీసీసీ డీఎం జి.పార్వతీశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో పంచాయతీల పాత్రే కీలకం

ప్రజా ప్రతినిధుల శిక్షణ కార్యక్రమంలో వక్తలు


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్‌లు

ఏలూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : పోలవరం మండల ప్రజా పరిషత్ అధికారి ఇ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సర్పంచులకు ఎంపీటీసీలకు గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం ఎలాంటి ప్రణాళికలు ఎలా సిద్ధం చేయాలి, ఎలా అమలు చేయాలనే అంశాలపై ఎంపీడీవో సర్పంచులకు ఎంపీటీసీలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పట్టిసీమ సర్పంచు సబ్బారపు శ్రీరామ్మూర్తి, కొత్తపట్టిసీమ సర్పంచ్ మైగాపుల విజయదుర్గ, ఎంపీటీసీ వలవల వరలక్ష్మి, కాశీ ధనలక్ష్మి వైస్ ఎంపీపీ శింగరాజు, అబ్దుల్ సలాం పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

టి.నరసాపురం : గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయడానికి ప్రణాళికను రూపొందిస్తున్నట్టు ఎంపీడీవో మణికుమారి తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధిపై ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ఎంపీడీవో మణికుమారి అధ్యక్షతన మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమం గ్రామ పంచాయతీల్లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించడానికి దోహదప డుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ డి.లక్ష్మి, పంచాయతీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం

పెదవేగి : గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని పెదవేగి ఎంపీడీవో పి.శ్రీనివాస్ అన్నారు. గ్రామ పంచాయ తీల అభివృద్ధి, ప్రణాళికపై సర్పంచ్‌లకు ఏర్పాటు చేసిన ఒకరోజు శిక్షణా కార్యక్రమం పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రమ్య అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులను ఉపయోగించుకుని గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పారిశుధ్యం, సురక్షితమైన తాగు నీటిపై ప్రత్యేక ప్రణాళికను రూపొందించుకుని ముందుకెళ్లాలని చెప్పారు. ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యతను ఇవ్వా లని, అప్పుడే గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుందని ఆయన వివరించారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి..

జీలుగుమిల్లి : గ్రామ పంచాయతీల అభివృద్ధికి స్థానిక ప్రజా ప్రతినిధులు కృషి అవసరమని ఎంపీడీవో కె.వెంకట లక్ష్మీ అన్నారు. కార్యాలయంలో మంగళవారం పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక శిక్షణ కార్యక్రమం జరిగింది. సుస్థిర అభివృద్ధి సాధనకు ఆదాయ వనరుల సమీకరణ, పారిశుధ్యం ప్రజారోగ్యం వంటి అంశాలపై ప్రజా ప్రతినిధులకు శిక్షణ ఇచ్చారు. ఎంపీపీ కొర్స పోశమ్మ, జెడ్పీటీసీ మల్లం వసంత్, ఇవోపీఆర్డీ నిఖిల్ మధుశరణ్, పంచాయితీ కార్యదర్శులు సర్పంచ్‌లు ఉన్నారు.

మిగులు బడ్జెట్‌ను ఆమోదించిన జంగారెడ్డిగూడెం మునిసిపల్ పాలకవర్గం

ఏలూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డి గూడెం పురపాలక సంఘం బడ్జెట్ సమావేశం మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. మున్సిపాలిటీలో ప్రారంభ నిల్వ రూ.3.13 కోట్లతో పాటు రానున్న ఆర్థిక సంవత్సరంలో మున్సిపాలిటీ ఆదాయం రూ.16.94 కోట్లుగా అంచనా వేయగా మొత్తం ఖర్చు రూ.19.48 కోట్లుగా చూపి రూ.60.09 లక్షల రూపాయల మిగులు బడ్జెట్‌ను మున్సిపల్ పాలకవర్గం ఆమోదించింది. బడ్జెట్ సమావేశం అనంతరం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది.సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కమిషనర్ కె.వి.రమణ, ఆర్ఐ.ఎన్ సుబ్బారావు, మేనేజర్ రమణి, టీపీవో చాందిని పాల్గొన్నారు.

స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి : ఆశా వర్కర్ల యూనియన్

చింతలపూడి, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : స్కీం వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కె.పోశమ్మ అన్నారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో మంగళవారం మండల కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఆశా వర్కర్లకు పని భారం పెంచడమే కాకుండా 2024లో సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేటి వరకు అమలు చేయకుండా ప్రభుత్వం సవతి తల్లి ప్రేమను చూపిస్తోందని అన్నారు. సమ్మె సందర్భంగా రిటైర్మెంట్ బెనిఫిట్స్, చనిపోయిన వారికి బీమా సౌకర్యం, మెటర్నటి లీవ్ డిమాండ్లను గత ప్రభుత్వం అంగీకరించిందని అన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.వి.ఎస్.నారాయణ, గౌరవ అధ్యక్షులు బాలరాజు, యూనియన్ నాయకురాళ్లు పుణ్యవతి, సంపూర్ణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్లపై విజిలెన్స్ తనిఖీలు


వాటర్ ప్లాంట్ ను పరిశీలిస్తున్న అధికారులు

ఏలూరు క్రైం, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : ఏలూరు నగరంలో ఉన్న వాటర్ ప్లాంట్లపై విజిలెన్సు అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. విజిలెన్సు ఎస్పీ శ్రీరాంబాబు ఆదేశాల మేరకు విజిలెన్సు ఇన్‌స్పెక్టర్లు సీఐ పి.శివరామకృష్ణ, డి.ప్రసాద్ కుమార్, విజిలెన్సు ఏవో జి.మీరయ్య, ఎస్ఐ కె. సీతారాం, ఆహార తనిఖీ అధికారులు కె.రామరాజు, డీవీ కావ్యారెడ్డి, తూనికలు కొలతల అధికారి వి. ప్రశాంత్ కుమార్‌లు మంగళవారం ఏలూరులో విస్తృతంగా వాటర్ ప్లాంట్లను తనిఖీలు చేశారు. ఈ దాడుల్లో తయారీ తేదీ లేకుండా ప్యాకింగ్ చేసిన వాటర్ బాటిల్స్, ప్యాకెట్లు, యూనిట్ సేల్స్ ప్రైస్‌లేని వాటర్ బాటిల్స్, నిమ్మసోడా బాటిల్స్‌ను గుర్తించారు. ఆహార భద్రతా చట్ట ప్రకారం తూనికలు కొలతలు చట్ట ప్రకారం వారిపై కేసులు నమోదు చేసినట్టు అధికారులు తెలిపారు.

ఉత్తమ అధికారికి అభినందన


వీఆర్వో వెంకటేశ్వరరావును అభినందిస్తున్న దృశ్యం

లింగపాలెం, జనవరి28(ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకల్లో భాగంగా ఉత్తమ పురస్కారం అందుకున్న ఆసన్నగూడెంలో వీఆర్వో దాసరి వెంకటేశ్వరరావును మంగళవారం ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నజీముల్లాషా పాల్గొని మాట్లాడుతూ చేసేపనిలో నిబద్ధత, నిజాయితీ ఉంటే మంచి అధికారిగా గుర్తింపు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ అర్హతా పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలి


పరీక్షల నిర్వహణపై ప్రిన్సిపాల్స్, లెక్చరర్లతో మాట్లాడుతున్న ఆర్ఐవో చంద్రశేఖర్ బాబు

ఏలూరు అర్బన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ అర్హత పరీక్షలు పటిష్ఠంగా నిర్వహించాలని ఇంటర్ బోర్డు ఆర్ఐవో చంద్రశేఖర్ బాబు సూచించారు. ఫిబ్రవరి 1, 3వ తేదీల్లో నిర్వహించే పరీక్షలపై మంగళవారం జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, జూనియర్ లెక్చరర్లతో సమీక్ష నిర్వహించారు. నైతికత, మానవ విలువలు, పర్యావరణ విద్య పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుందని అన్నారు.ఈ రెండు పరీక్షలు విద్యార్థులు చదివే కళాశాలల్లోనే జరుగుతున్నందున ఎక్కడా మాల్ ప్రాక్టీస్‌కు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షల ప్రత్యేకాధికారి, డీవీఈవో ప్రభాకర రావు మాట్లాడుతూ ఒకేషనల్, జనరల్ ప్రాక్టికల్స్ పరీక్షల్లో ప్రభుత్వం నిర్దేశించిన నియమాలను ఖచ్చితంగా పాటించాలని, ఉల్లంఘనలకు పాల్పడే వారిపై బోర్డు నిబంధనల మేరకు శాఖాపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. డీఈసీ సభ్యులు కె.యోహాన్, ఎల్.శ్యాం కుమార్, బి.వి.శ్రీనివాస్, పి.జ్యోతి, కె.మురళీ మోహనకృష్ణ, పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి రాజశేఖర్ గెలుపునకు కృషి చేయండి : చంటి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూటౌన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలుపునకు అంతా సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే బడేటి చంటి పార్టీ నేతలకు సూచించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చంటితో పాటు ఎన్నికల పరిశీలకులు వి.చిరంజీవి ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్‌తో పాటు బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. జనసేన నాయకులు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ బూత్ కమిటీ సభ్యులు సమిష్టి కృషితో ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్‌ను గెలిపించాలని కోరారు. టీడీపీ జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు.

వాసవీ మాత ఆత్మార్పణ వేడుకల నిర్వహణ పట్ల ఆర్య వైశ్యుల హర్షం


బాలకృష్ణతో అంబికా కృష్ణ

ఏలూరు రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి):ఆర్య వైశ్యుల ఇలవేల్పు శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆత్మార్పణ రోజును రాష్ట్ర కార్యక్రమంగా నిర్వహించేందుకు జీవో ఇవ్వడం పట్ల ఏలూరు మాజీ ఎమ్మెల్యే, బీజేపీ సీనియర్ నాయకులు అంబికాకృష్ణ చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆత్మార్పణ రోజును అధికారికంగా నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల వ్యక్తం చేశారు. అంతే కాకుండా ఈ నెల 31వ తేదీన పెనుగొండలో జరిగే అమ్మవారి ఆత్మార్పణ దినోత్స వానికి సీఎం స్వయంగా హాజరై పట్టువస్త్రాలు సమ ర్పించడం గొప్పవిషయమని అన్నారు. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణకు పద్మ విభూషణ్ పురస్కారానికి ఎంపిక చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

గీత సామాజిక వర్గం నుంచి అర్జీల స్వీకరణ

చింతలపూడి, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో సాగిపాడు గ్రామంలో ఎక్సైజ్ అధికారులు దాడి జరిపి 50 మద్యం బాటిళ్ళు స్వాధీనం చేసుకున్నట్టు సిఐ పి.అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలపూడి సర్కిల్ పరిధిలో గీత కులాల మద్యం దుకాణాల ఎంపిక ప్రక్రియకు ఫిబ్రవరి 5వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తెలిపారు.

నిర్వాసితుల సమస్యలపై 30న ప్రచార జాత

ఏలూరు కార్పొరేషన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 30వ తేదీన ప్రచార జాత నిర్వహిస్తున్నట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి తెలిపారు. ఈ ప్రచార జాత జిల్లాలో 30వ తేదీ వరకు ఉంటుందని, అనంతరం నెల్లూరులో జరిగే సీపీఎం 25వ రాష్ట్ర మహా సభలకు వెళ్తుందని తెలిపారు. ఈ మహాసభల్లో రాష్ట్ర రాజకీయాలు, ప్రజా సమస్యలపై చర్చిస్తామన్నారు.

పశు వైద్యశిబిరాలను సద్వినియోగించుకోండి

లింగపాలెం, జనవరి28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాడి రైతుల కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తోందని పాడి రైతులు ఈ అవకాశాలను ఉపయోగించుకోవాలని నియోజకవర్గ రైతు అధ్యక్షుడు మోరంపూడి మల్లికార్జున రావు అన్నారు. మండలంలో జరుగుతున్న పశువైద్య శిబిరాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు బి.మహేష్, సూర్య, రాజ్ కుమార్ పాడి రైతులు పాల్గొన్నారు.

'శ్మశాన వాటికలను అభివృద్ధి చేస్తాం'

ఏలూరు టూటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలో స్మశాన వాటికల గురించి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాలా బాలాజీ అన్నారు. 3వ డివిజన్‌లో హిందూ స్మశాన వాటికను బాలాజీ ఆధ్వర్యంలో శుభ్రపరిచారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ ఈ 3వ డివిజన్ స్మశాన వాటికలో నీటిబోర్లు ఎమ్మెల్యే బడేటి చంటి సొంత నిధులు కేటాయించి అభివృద్ధి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకట రమణ, శివశంకర్, రత్తయ్య, త్రిమూర్తులు, ఆర్. రాంబాబు, శంకరరావు, పాల్గొన్నారు.

పంచాయతీల్లో డ్రైనేజీల నిర్మాణానికి భూమి పూజ

పోలవరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : పోలవరం, కొత్తపట్టిసీమ పంచాయతీల్లో నూతన డ్రైనేజీల నిర్మాణ పనులను సర్పంచులు మైగాపుల విజయదుర్గ, పొడుం పుష్ప ప్రారంభించారు. గత 35 సంవత్సరాలుగా కొత్తపట్టి సీమ డాక్టరు వీధిలో ప్రధాన సమస్యగా ఉన్న డ్రైనేజీల సమస్య పరిష్కారానికి ఆ వీధిలో రోడ్డు మధ్యలో సుమారు 200 మీటర్ల పొడవునా అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణం పనులు ప్రారంభించారు. తమ పంచాయతీ అభివృద్ధికి మండల పరిషత్ నిధులు కేటాయించిన ఎంపీపీ సుంకర వెంకట రెడ్డికి ఈ సందర్భంగా సర్పంచ్ విజయదుర్గ, ఎంపీటీసీ వలవల వరలక్ష్మి, గ్రామ పెద్ద మైగాపుల దుర్గాప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు కొణతాల ప్రసాద్, టీడీపీ నాయకులు మంగిన కొండ, యడ్ల వినోద్, బండి బాబి, అనిశెట్టి రాధయ్య, శ్యాం, కుడిదాల శ్రీను, రవి పాల్గొన్నారు.

మద్ది ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

ఏలూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డి గూడెం మండలంలోని గురవాయిగూడెం గ్రామంలో ఉన్న శ్రీమద్ది ఆంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం స్వామికి వేకువ జామున ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తమలపాకులతో స్వామికి విశేష పూజలు నిర్వహించారు. వివిధ సేవల రూపంలో స్వామి వారి ఆలయానికి రూ.1,23,720 ఆదాయం వచ్చినట్టు ఈఓ ఆర్.వి. చందన తెలిపారు.


తహసీల్దారు, ఆర్‌ఐలను సత్కరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఉత్తమ అవార్డు గ్రహీతలకు సత్కారం

పెదవేగి, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : జిల్లా ఉత్తమ తహసీల్దారుగా పెదవేగి మండల తహసీల్దారు ఎస్డీ భ్రమరాంబ, ఉత్తమ ఆర్ఐగా కేవీ సారథి ఉత్తమ ఉద్యోగ అవార్డులు అందుకున్న నేపథ్యంలో పెదవేగిలోని రెవెన్యూ ఉద్యోగులు, రేషన్ డీలర్లు తహసీల్దారు భ్రమరాంబ, ఆర్ఐ సారధిలను మంగళవారం సన్మానించారు.

పలువురు అధికారులకు సత్కారం..

కామవరపుకోట : కామవరపు కోట మండలంలోని అధికార ఉద్యోగులను మంగళవారం సత్కరించారు. కలెక్టర్ నుంచి ప్రశంసలు పొందిన తడికలపూడి కానిస్టేబుల్ దారా అనీల్ కుమార్, కామవరపుకోట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పల్లెపాం రామకృష్ణ, తడికలపూడి వీఆర్వో మాదు లక్ష్మీనారాయణ, జంగారెడ్డి గూడెం ఆర్డీవో ఎ.వి. రమణ నుంచి ప్రశంసా పత్రాలు పొందిన తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ కరిపోతు ప్రమోద్‌కుమార్, గుంటుపల్లి వీఆర్వో కె.ప్రభాకరరావులను తహశీల్దార్ గెడ్డం ఎలీషా, ఎంపిడిఓ సరళకుమారి, తడికలపూడి ఎస్ఐ చెన్నారావు, ఏఎస్ఐ వీరా స్వామి సత్కరించి అభినందించారు.

భక్తులకు అన్నదానం

పెదపాడు, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : పెదపాడు మండలం అప్పనవీడు అభయాంజనేయస్వామి ఆలయం వద్ద దాత కల్లేపల్లికి చెందిన సత్యనారాయణ, ప్రదీప్ కుమార్‌ల ఆర్థిక సహకారంతో సుమారు 200 మందికి అన్నదానం నిర్వహించినట్టు ఆలయ ఈవో పితాని తారకేశ్వర రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ సిబ్బందితో పాటుగా భక్తులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది బైక్ ర్యాలీ

ఏలూరు అర్బన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయ అధికారులు, ఉద్యోగులు హెల్మెట్లు ధరించి బైక్ ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ధారణ ఆవశ్యకతపై డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని వివరించారు. ప్రోగ్రాం ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పివోను కలిసిన జీసీసీ డీఎం

బుట్టాయగూడెం, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : గిరిజన సహకార సంస్థ డివిజనల్ మేనేజర్ జి.పార్వతీశ్వరావు కె.ఆర్.పురం ఐటీడీఏ పీవో, ఆర్అండ్ఆర్ ఆఫీసర్ కె.రాములు నాయక్‌ను మంగళవారం ఐటీడీఏలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. జీసీసీ ఉత్పత్తులను వివరించారు. జీసీసీ ద్వారా ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలకు అందిస్తున్న వస్తువులు, సరుకులను పీవోకు తెలియజేశారు.

కూటమి అభ్యర్థి రాజశేఖర్ గెలుపునకు కృషి చేయాలి

పెదవేగి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలుపునకు పార్టీ కార్యకర్తలంతా తమవంతు భాగస్వామ్యం అందించాలని ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి అన్నారు.పెదవేగి మండలం దుగ్గిరాల ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికల విధి విధానాలపై అవగాహన కల్పించారు.ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి మాట్లాడుతూ తక్కువ సమయంలోనే దెందులూరు నియోజకవర్గం పరిధిలో 8 వేలకు పైగా పట్టభద్రుల ఓట్లు నమోదు కావడం విశేషమన్నారు.దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మాగంటి నారాయణప్రసాద్, గుత్తా అనిల్, మంచినేని శ్రీనివాసరావు, మాగంటి సురేంద్రనాథ్ చౌదరి, పరసా వెంకట్రావు, కొనకళ్ళ శివమణి, మోరు శ్రావణి, జి.రామసీత పాల్గొన్నారు.

ఎంపీ మహేష్‌కు ప్రజా సమస్యలపై వినతి

ఏలూరు రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ మంగళవారం జనసేన నాయకులు నారాశేషు ఆహ్వానం మేరకు మంగళవారం ఎన్.హోటల్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీని ఘనంగా సత్కరించారు. పుష్పగుచ్ఛాలు అందచేశారు. అనంతరం నగరంలోని పలు ప్రజా సమస్యలపై ఎంపీతో చర్చించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, టీడీపీ నాయకులు పూజారి నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో పలువురి చేరిక

ఏలూరు రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఏలూరు నియోజకవర్గంలోని 25వ డివిజన్ గౌరవరానికి చెందిన 50మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి దోనేపూడి లావరాజు ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరారు. వీరికి ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డిఅప్పలనాయుడు పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలు, పవన్ కల్యాణ్ ఆశయాలు నచ్చి వైసీపీని వీడి జనసేనలో చేరటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఒబ్బిలిశెట్టి శ్రావణ్ కుమార్ గుప్తా, నగిరెడ్డి కాశీనరేష్, వై.ధర్మేంద్ర, రవి తదితరులు పాల్గొన్నారు.

గొమ్ముగూడెంలో పశు వైద్య శిబిరం

కుక్కునూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొమ్ముగూడెం గ్రామంలో మంగళవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా పశువులు, మేకలు, గొర్రెలు నట్టల నివారణ మందు రైతులకు పంపిణీ చేశారు. అలాగే సీజన్‌వారిగా పశువులకు వచ్చు వ్యాధులువాటి నివారణ చికిత్సలపై రైతాంగానికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది కే.రాజు, కే.దొరబాబు, ఎస్.రవి కుమార్, సంతోష్ తదితదరులు పాల్గొన్నారు.

సూరప్పగూడెంలో పొలంబడి

భీమడోలు, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : భీమడోలు మండలం సూరప్పగూడెం గ్రామంలో భీమడోలు వ్యవసాయ శాఖ అధికారులు పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో రైతులకు మట్టినమూనా పత్రాలు అందజేశారు. గ్రామంలో పంట పొలాలను సందర్శించి సల్ఫర్ లోపాన్ని గుర్తించారు.

శ్రీవారి హుండీ ఆదాయం లెక్కింపు

ఏలూరు కార్పొరేషన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : దేవదాయ శాఖ ఆధ్వర్యంలోని రామచంద్ర రావుపేటలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ హుండీని 41 రోజులకు గాను మంగళవారం లెక్కించగా 7లక్షల 87 వేల 566 రూపాయల ఆదాయం వచ్చినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీష్ కుమార్ తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో దేవదాయ శాఖ అధికారులు, సిబ్బంది, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.


హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..

ఆంధ్రజ్యోతి



సదస్సులో పాల్గొన్న నాయకులు, ప్రజలు



సదస్సులో మాట్లాడుతున్న ఆంధ్రజ్యోతి బ్యూరో ఇన్‌చార్జి జీవీఎస్ఎన్ రాజు

తెలుగు ప్రజల గుండె చప్పుడు ఆంధ్రజ్యోతి. నిత్యం వినూత్న కథనాలతో.. ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తూ బాధితుల పక్షాన అండగా నిలుస్తోంది. తాజాగా 'ఆంధ్రజ్యోతి అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఏలూరు జిల్లా నూజివీడు జంక్షన్ రోడ్‌లోని సంగం కాంప్లెక్స్ మినీ ఫంక్షన్ హాలు, పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం గణేశ్ నగర్‌లోని సుబ్రహ్మణ్యస్వామి గుడి వద్ద మంగళవారం సదస్సులు నిర్వహించారు. తాడేపల్లిగూడెంలో సమస్యలను పరిష్కరిస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ప్రజలకు హామీ ఇచ్చారు. నూజివీడులో మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణి దుర్గ సమస్యలపై స్పందించి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.

నూజివీడు పట్టణంలో సమస్యలపై ప్రజాగళం

చెరువుకట్ట బలోపేతం చేయాలి



పెద్ద చెరువుకు గండిపడి దాదాపు నూజివీడు సగం ప్రభావితమైంది. ముంపు సమస్య, తాగునీటి సమస్యలు తలెత్తాయి. ముందుందు ఇలాంటి పరిస్థితి ఎదురుకాకుండా చెరువుకట్టను బలోపేతం చేయాలి. చెరువులను అభివృద్ధిచేసి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుగా ఉపయోగించాలి. పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలి

- కందిపల్లి చెన్నారావు, మాజీ కౌన్సిలర్, నూజివీడు

కల్వర్టు నిర్మించండి



నూజివీడు ఎస్‌బీఐ సమీపంలో కల్వర్టు శిథిలమైంది. రద్దీగా ఉండే రహదారి కావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నడిచి వెళ్లేవారికి సైతం ఇబ్బందులు తప్పడం లేదు. మీకోసంలో ఫిర్యాదు చేసినా స్పందన లేదు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

- అవిర్నేని వెంకటేశ్వరరావు, నూజివీడు

వాహనాలు శిథిలం



నూజివీడు మున్సిపల్ పరిధిలో వివిధ ప్రభుత్వ శాఖల వాహనాలు శిథిలమై నిరుపయోగంగా మారాయి. అనేక ప్రభుత్వస్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. హైడ్రాలో తీసుకున్న చర్యల్లా నూజివీడులోనూ అధికారులు కఠినంగా వ్యవహరించి చర్యలు చేపడితే తప్ప పరిస్థితి మెరుగుపడదు.

- విజయ్‌కుమార్, బాపూనగర్, నూజివీడు

వాగు ఆక్రమణలు తొలగించండి



నూజివీడు బస్టాండ్ సమీపంలో వాగు ఆక్రమణకు గురై చిన్న డ్రైయినేజి స్థాయిలో ఉండిపోయింది. పై నుంచి మూడు వాగులు కలిసి వస్తున్న సందర్భంలో వరదనీరు నూజివీడు బస్టాండు సమీప ప్రాంతాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఆక్రమణలు తొలగించి వాగును పునరుద్ధరించాలి.

- మోచర్ల నాగరాజు, 19వ వార్డు, నూజివీడు

రహదారులు అధ్వానం



నూజివీడు పట్టణంలో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. పెద్ద గాంధీబొమ్మ సెంటర్ నుంచి బైపాస్ వరకు వెళ్లాలంటే నిత్యం నరకం కనిపిస్తోంది. వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రభుత్వం మారితే తమ పరిస్థితులు మారతాయని, ప్రజలు ఆశగా ఎదురుచూశారు. రహదారుల మరమ్మతులు చేపట్టాలి.

- ముమ్మనేని సునీల్, నూజివీడు

అధికారుల నిర్లక్ష్యం



పట్టణంలో పారిశుధ్య దుస్థికి ప్రజల బాధ్యతారాహిత్యంతో పాటు అధికారుల నిర్లక్ష్యం కారణం. పారిశుధ్య నిర్వహణకు సచివాలయాల సిబ్బందిని సమర్థవంతంగా వినియోగించుకుని ప్రజల్లో అవగాహన కల్పిస్తే స్వచ్ఛ నూజివీడుగా తీర్చిదిద్దవచ్చు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రింగ్‌రోడ్డును ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- రామరాజు, గాంధీనగర్, నూజివీడు

సిబ్బంది ఏం చేస్తున్నారో



మున్సిపల్ పరిధిలో 115మంది కాంట్రాక్ట్, పారిశుధ్య కార్మికులతో పాటు మరో 30మంది కార్మికులు పనిచేస్తున్నారు. కాని వార్డులో ఒకరిద్దరికి మించి పనిచేస్తున్న దాఖలాలు లేవు. దేశంలో స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా మున్సిపాల్టీలకు నిర్మల్ పురస్కారాలను కేంద్రప్రభుత్వం ప్రకటిస్తుంటే నూజివీడు చివరిస్థానంలో నిలుస్తుందేమో.

- ముత్యాల కామేష్, గాంధీనగర్, నూజివీడు

విజయవాడ జిల్లాలో కలపాలి



సార్వత్రిక ఎన్నికల సమయంలో నూజివీడు నియోజకవర్గాన్ని విజయవాడ జిల్లాలో కలుపుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. హామీ ప్రకారం నూజివీడును విజయవాడలో కలిపితే సీఆర్‌డీఏ పరిధితో నూజివీడు పట్టణం స్మార్ట్ సిటీగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

- మల్లిపూడి రాజశేఖర్, నూజివీడు

కోతులతో ప్రాణాలు పోతున్నాయి



ఎంప్లాయీస్ కాలనీలో కోతుల దాడుల కారణంగా ప్రాణాలు పోతున్నాయి. బట్టలు ఆరవేసుకోవడానికి పైకి వెళ్లిన మహిళపై కోతులు దాడిచేయడంతో డాబా పైనుంచి పడి వెన్నుముక విరిగి జీవచ్ఛవంలా మారారు. పట్టణంలో కోతుల సంచారం నివారించి ప్రజల ప్రాణాలు కాపాడండి.

- వినయ్‌కుమార్, ఎంప్లాయీస్ కాలనీ, నూజివీడు

టిడ్కో ఇళ్లు ఇవ్వండి



నూజివీడు ఎమ్మార్ అప్పారావు కాలనీలో టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వాలి. గత ప్రభుత్వం లబ్ధిదారుల పేరుతో రుణాలు పొందడంతో లబ్ధిదారులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. మంత్రి సారథి సంక్రాంతికి ఇళ్లు పూర్తిచేసి ఇస్తామన్నారు. త్వరగా ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వాలి.

- బోను అప్పారావు, 2వ వార్డు, నూజివీడు

నిస్సారంగా పార్కులు



నూజివీడు మున్సిపాల్టీలో జనాభా పెరిగింది. కాంక్రీట్ అరణ్యంగా మారుతోంది. సేదతీరేందుకు కనీసం ఒక్కపార్క్ లేదు. ఉన్న పార్కులు నిర్వీర్యమైయ్యాయి. రాఫిన్ రియల్‌ఎస్టేట్ వారు డెవలప్ చేసిన పార్క్ సైతం ఇప్పుడు నిరుపయోగంగా మారింది. క్రీడాస్థలాలు, వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేయాలి.

- కోలాహలం సత్య వరప్రసాదరాజు, నూజివీడు

కోతుల బెడద తప్పించండి



పట్టణంలో కోతుల బెడద తీవ్రంగా ఉంది. ఆర్‌ఎంపీ వైద్యురాలిగా ఉన్న నా వద్దకు రోజుకు ఇద్దరు వైద్య చికిత్స కోసం వస్తున్నారు. కోతులు, కుక్కలు దాడుల కారణంగా ప్రజలు తీవ్ర గాయాలపాలవుతున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఈ సమస్యపై అధికారులు తక్షణం స్పందించి చర్యలు చేపట్టాలి.

- శివరాజు వసుంధరాదేవి, నూజివీడు

ప్రతిరోజూ తాగునీరు ఇవ్వండి



నూజివీడు మున్సిపల్ పరిధిలో రెండు రోజులకు ఒకసారి తాగు నీరు సరఫరా అవుతోంది. పట్టణ ప్రజలకు తాగునీటి తిప్పలు తప్పడం లేదు. వేసవిలో సమస్య మరింత తీవ్రం. పట్టణ ప్రజలకు ప్రతిరోజూ తాగునీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండాలి.

- రిమ్మనపూడి నాగమణి, గాంధీనగర్, మాజీ కౌన్సిలర్

ప్లాస్టిక్ వాడకం నిర్మూలించాలి



పట్టణంలో ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం అమలు కావడం లేదు. వివిధ వ్యాపార వర్గాలు డ్రెయిన్‌లో చెత్త వేస్తున్నాయి. అలాంటి పనులు చేసేవారిపై జరిమానా విధించాలి. పట్టణంలో పశువులను రహదారులపై వదిలివేస్తున్నారు. వారిని గుర్తించి అపరాధ రుసుము విధించటం, లేదా పశువులను సంరక్షణ కేంద్రాలకు తరలించటం చేయాలి.

- లక్ష్మీశ్రీనివాసరావు 24వ వార్డు, నూజివీడు

పిట్టలోళ్ల గుడిసెల దగ్ధం ఘటనలో మరో ముగ్గురి మృతి

మండవల్లి జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండవల్లి మండలం భైరవపట్నంలో ఈనెల 24వ తేదీ రాత్రి పిట్టలోళ్ల గుడిసెల దగ్ధం ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న క్షతగాత్రులు ఇప్పటివరకు మొత్తం నలుగురు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. మంగళవారం ఉదయం ముగ్గురు మరణించారని డబ్బా పాప అలియాస్ అను(20) గుంటూరు జీజీహెచ్ హాస్పిటల్లో చికిత్స పొందుతూ మృతి చెందగా, నక్కల చరణ్(19), కార్తీక్(17)ను తమిళనాడు వేలూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఇప్పటికే ఈ ఘటనలో గుంటూరు జీజీహెచ్ చికిత్స పొందుతున్న మూడేళ్ల చిన్నారి విక్కీ మృతి చెందిన విషయం తెలిసిందే. ఒకే కుటుంబానికి చెందిన మొత్తం ఆరుగురు అగ్నిప్రమాద బాధితులు ఒక్కొక్కరిగా మృతి చెందడంతో బంధువులతో పాటు భైరవపట్నంలోని తోటి గ్రామస్థులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. క్షతగాత్రులు మిగిలిన ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో భైరవపట్నంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మండవల్లి ఎస్ఐ రామచంద్రరావు సిబ్బందితో పాటు గుంటూరు హాస్పిటల్‌కి వెళ్లి మృతురాలి అను మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.



పాఠశాలలో విచారణ జరుపుతున్న డీవైఈవో రవిప్రకాశ్, తదితరులు

విద్యార్థినిపై ఉపాధ్యాయుడి అనుచిత ప్రవర్తన

హైస్కూల్‌లో టీచర్ తీరుపై డీవైఈవో విచారణ

కైకలూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పదో తరగతి చదువుతున్న విద్యార్థినిని పెళ్లి చేసుకుంటానంటూ ఓ ఉపాధ్యాయుడు అనుచితంగా ప్రవర్తిస్తున్న ఘటనపై కైకలూరు మండలంలో ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. వివరాలివి.. మండలంలోని ఓ జిల్లా పరిషత్ హైస్కూల్లో చదువుతున్న విద్యార్థినిని అదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు పెళ్లి చేసుకుంటానని ఇటీవల సంక్రాంతి సెలవుల్లో బాలిక కుటుంబ సభ్యుల దృష్టికి తీసుకువెళ్లాడు. వారి కుటుంబసభ్యులు ఉపాధ్యాయుడితో వాగ్వాదానికి దిగి అతడి తీరుపై హెచ్‌ఎంకు ఫిర్యాదు చేశారు. హెచ్‌ఎం జిల్లా విద్యాశాఖాధికారికి ఫిర్యాదు చేయగా ఈ మేరకు ఏలూరు డీవైఈవో రవిప్రకాష్ మంగళవారం స్కూల్లో విచారణ చేపట్టారు. ఆ విద్యార్థినితో పాటు పలువురు విద్యార్థినులను, ఉపాధ్యాయులను వేర్వేరుగా విచారణ చేశారు. గతంలో ఆ ఉపాధ్యాయుడు పనిచేసిన పాఠశాలల్లో అనేక ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. పనిష్మెంట్‌పై అప్పటి ఉన్నతాధికారులు వేర్వేరు ప్రదేశాలకు బదిలీలు చేసినట్టు డీవైఈవో తెలిపారు. ప్రస్తుతం ఆ ఉపాధ్యాయుడు ఈనెల 18వ తేదీ నుంచి మెడికల్ లీవ్‌లో ఉన్నాడని అయినా విచారణకు రావాలని ఆదేశించడంతో హాజరయ్యాడన్నారు. విద్యార్థిని బంధువులు, తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇచ్చిన సమాచారం మేరకు పూర్తిస్థాయి నివేదికను డీఈవోకు అందజేస్తామని డీవైఈవో తెలిపారు.

'కొల్లేరు ప్రజలకు అండగా ఎమ్మెల్యే కామినేని'

కైకలూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కొల్లేరు ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఎప్పుడూ అండగా ఉంటారని, ఇటీవల కొంతమంది వైసీపీ నాయకులు అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని జనసేన పార్టీ నాయకుడు కొల్లి వరప్రసాద్ అన్నారు. మంగళవారం కైకలూరు జనసేన పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. 2006లో కొల్లేరు ఆపరేషన్ చేసింది అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని అప్పటి నుంచి కాంగ్రెస్, వైసీపీ ప్రభుత్వాలు కొల్లేరు ప్రజల సంక్షేమాన్ని కోరలేదన్నారు. ఇటీవల కొల్లేరు ప్రజల సమావేశం జరగడంతో ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్‌పై బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. కొల్లేరులో సర్కారు కాల్వ వంతెన నిర్మాణానికై కేంద్రప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకువచ్చి 50 శాతం పనులు పూర్తిచసిన ఘనత కామినేనిదేనని గుర్తు చేశారు. జనసేన పార్టీ మహిళా నాయకురాలు తోట లక్ష్మి, తులసీ పూర్ణ, సాయి, తదితరులు పాల్గొన్నారు.

పశువుల్లో వ్యాధులపై అవగాహన

ముసునూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పశువుల్లో వ్యాధులను నిర్మూలించి ఆరోగ్యమైన పశుసంపదకు ప్రభుత్వం కృషిచేస్తోందని సర్పంచ్ కందేపు రామగిరి అన్నారు. చింతలవల్లి, చిల్లబోయినపల్లి గ్రామాల్లో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించారు. పశువులను పశువైద్య అధికారి ఎం. వెంకటచైతన్య పరీక్షించారు. ముదినేపల్లి మండలంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాలను నిర్వహించి 450 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించామని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు డాక్టర్ క్రాంతి కుమార్, డాక్టర్ ఆరేపల్లి రామకృష్ణ తెలిపారు. పెదపాలపర్రు, బొమ్మినంపాడు, ప్రొద్దువాక గ్రామాల్లో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరాల్లో పాడి గేదెలకు చూడి పరీక్షలు జరిపి మందులు అందజేశారు. పశువులతోపాటు గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేశారు.

పేరూరు రేషన్ డీలర్ పోస్టుకు దరఖాస్తుల నిల్

ముదినేపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పేరూరు ప్రభుత్వ చౌక ధరల దుకాణం డీలర్ పోస్టుకు ఎవరూ దరఖాస్తులు చేయలేదు. ఖాళీగా ఉన్న ఈ డీలర్ పోస్టుకు ఈనెల 21తో దరఖాస్తుల గడువు ముగిసింది. గడువులోగా ఎవరూ దరఖాస్తు చేయకపోవడంతో ఆ పోస్టు ఖాళీగానే ఉంది. ఈ డీలర్‌షిప్ పోస్టును ఓసీ (ఓసి) ఈడబ్ల్యూఎస్ కేటగిరీకి కేటాయించడంతో గ్రామంలో 99 శాతంపైగా బీసీలు ఉండడంతో వీరికి దరఖాస్తు చేసే అర్హత లేకుండాపోయింది. గ్రామంలో రెండు, మూడు కుటుంబాలు ఓసీలు ఉన్నప్పటికీ వారు కూడా అధికారులు చెప్పినప్పటికీ దరఖాస్తులు చేసేందుకు ఆసక్తి చూపలేదు. పేరూరు డీలర్ పోస్టు ఖాళీగానే ఉంది. తిరిగి పోస్టు భర్తీ చేసేందుకు రీ నోటిఫికేషన్ ఇచ్చే విషయం, రిజర్వేషన్‌పై ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకుంటారని తహసీల్దార్ సుభానీ తెలిపారు. డీలర్ నియామకం జరిగే వరకు దాకరం డీలర్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారని తెలిపారు.

కృష్ణ మాదిగకు పద్మశ్రీపై హర్షం

చాట్రాయి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగకు కేంద్రప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించటం పట్ల చాట్రాయి సెంటర్లో ఎమ్మార్పీఎస్ శ్రేణులు మంగళవారం కేక్‌కట్ చేసి ఆనందోత్సాహాలు జరిపారు. ఈ సందర్భంగా పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ సుదీర్ఘకాలం ఎమ్మార్పీఎస్ పోరాట ఫలితంగా ఎస్సీవర్గీకరణకు ఉన్నతన్యాయం స్థానం ద్వారా చట్టబద్ధత లభించిందని, మాలసోదరులు సహృదయంతో అర్థం చేసుకుని వర్గీకరణ అమలుకు సహకరించాలని కోరారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రవిరామ్, నాయకులు కోటజోషి, మారేష్, కొమ్ము ఆనంద్, శ్రీను, రమేష్, వివిధ గ్రామాల ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.



బొమ్మినంపాడులో రైతులకు సబ్సిడీ పురుగు మందులు అందజేస్తున్న జేడీఏ హబీబ్ బాషా

మినుము పంటపై తెగుళ్లను నిరోధించాలి

ముదినేపల్లి/కలిదిండి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మినుము పైరు తెగుళ్ల బారిన పడకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ హబీబ్ బాషా తెలిపారు. ముదినేపల్లి మండలం బొమ్మినంపాడు, కొరగుం టపాలెం గ్రామాల్లో మంగళవారం ఆయన వ్యవసాయ శాఖ ఏడీ వెంకటమణి, ఏవో వేణుమాధవ్, గ్రామ వ్యవసాయ సహాయకులతో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మినుము సాగును పరిశీలించి తెగుళ్ల సోకే అవకాశం ఉన్నందున రైతులు వ్యవసాయ శాఖ సిబ్బంది సూచనలను తీసుకోవాలని తెలిపారు. సర్పంచ్‌లు దారం సుధ, అచ్చిశెట్టి వెంకటేశ్వరరావు, పేరే రామ కృష్ణ, ఎంపీటీసీ దాసరి అరుణకుమారి తది తరులు పాల్గొన్నారు. కలిదిండి మండలం సానారుద్రవరం, గోపాలపురం గ్రామాల్లో ఏవో విద్యాసాగర్ ఆధ్వర్యంలో రైతులకు సూచనలు చేశారు. సానారుద్రవరం సర్పంచ్ నున్న రాజేశ్వరమ్మ, డీసీ వైస్ ఛైర్మన్ ఎన్.కృష్ణబాబు, పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న పల్లెవాడ సర్పంచ్ దుట్టా మణి

కైకలూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఎంపీపీ అడవి వెంకట కృష్ణమోహన్ అన్నారు. మంగళవారం కైకలూరు మండల పరిషత్ సమావేశపు మందిరంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. మండలంలో శివారు గ్రామాలైన ఆలపాడు, పల్లెవాడ గ్రామాలకు తాగునీరు పూర్తిస్థాయిలో అందడం లేదని కాల్వల ఆక్రమణల వల్ల శివారుకు నీరు సరఫరా కాకపోవడంతో తాగు నీరు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. శివారు గ్రామాలకు నీరు విడుదల చేసే సమయంలో కాల్వలను పూర్తి స్థాయిలో నీరు విడుదల చేయాల న్నారు. కైకలూరు గ్రామ పంచాయతీ పరిధిలోని పంట కాల్వలో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వస్తువులు వేయకుండా నివారణ చర్యలు చేపట్టాలని, రొయ్యలు, చేపల చెరువుల నీరు పంట కాల్వలోకి రాకుండా నిరోధించాలని సూచించారు. అనంతరం పలు శాఖలపై చర్చించారు. ఎంపీడీవో ఆర్.ఫణీంద్ర, వైస్ ఎంపీపీ ఎండీ జహీర్, పలు గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ



మాట్లాడుతున్న కొసరాజు కోటేశ్వరరావు

ఆగిరిపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కేకేఆర్ గౌతమ్ విద్యాసంస్థల చైర్మన్ కొసరాజు కోటేశ్వరరావు పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు 250 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. 250 మంది పేద విద్యార్థులకు పూర్తి వసతులతో కూడిన నాణ్యమైన విద్యనందిస్తూ వారికి అమెరికన్ లాంగ్వేజ్‌లో కూడా శిక్షణ ఇస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కూరాకుల ఊర్మిళ, నీటి సంఘం డైరెక్టర్ పంగిడేశ్వర్‌రావు, డైరెక్టర్ ఆనంద్‌కుమార్, ప్రిన్సిపాల్ శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): చిగురుకోట 132 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా కైకలూరు నియోజకవర్గ పరిధిలోని పలు సబ్‌స్టేషన్లలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు బుధవారం అంతరాయం కలుగుతుందని గుడివాడ విద్యుత్ శాఖ ఈఈ జీబీ శ్రీనివాసరావు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, ఆక్వారైతులు గమనించాలని కోరారు.

రేపటి నుంచి రథసప్తమి

ఆగిరిపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): శోభనాచల వ్యాఘ్రలక్ష్మీనరసింహస్వామి రథసప్తమి ఉత్సవాలు ఈనెల 30 నుంచి వచ్చేనెల 8 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో సీహెచ్.సాయి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నిత్యకల్యాణోత్సవంతో మొదటిరోజు గురువారం సాయంత్రం స్వామి వారిని చంద్రప్రభ వాహనంపై ఊరేగింపుగా కల్యాణ మండపంలోకి తీసుకునివచ్చి రాత్రి 9 గంటల వరకు నిత్యకల్యాణాన్ని నిర్వహిస్తారు. 4వ తేదీ రాత్రి 9 గంటలకు నిత్య కల్యాణం, 5న రథోత్సవం నిర్వహిమన్నారు.

నిధులు కేటాయించండి

కలిదిండి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని కోరుతూ అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాస్ కోరారు. మంగళవారం ఉండవల్లిలో మంత్రి లోకేశ్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. అగ్నికుల క్షత్రియుల నివశిస్తున్న గ్రామాలను పల్లవపాలెంలుగా పేర్లు మార్పు చేయాలని వివరించామని, అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

భైరవపట్నంలో అగ్నిప్రమాదం

మండవల్లి జనవరి 28(ఆంధ్రజ్యోతి): భైరవపట్నంలో కరెంటు ట్రాన్స్ ఫార్మర్ రిపేరు చేసే షెడ్ అగ్ని ప్రమాదానికి మంగళవారం గురైంది. సుమారు రూ.30 వేలు నష్టం వాటినట్లు అంచనా వేశారు. సమాచారం తెలుసుకున్న కైకలూరు అగ్నిమాపక కేంద్రం మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు.

పాఠశాల తనిఖీ

ముసునూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలని ఉపాధ్యాయులకు ఎంఈవో బీవీఎస్ సుబ్బారావు సూచించారు. చింతలవల్లి ఎంపీపీ పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన తనిఖీచేసి విద్యార్థులకు అందుతున్న బోధనపై ఆరా తీశారు. విద్యార్థులకు సులభతరమైన బోధనలు అందించి, వాటిలో నైపుణ్యతను వెలికితీసేలా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని ఎంఈవో సూచించారు.

పోతనపల్లిలో సారా స్వాధీనం

చాట్రాయి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతనపల్లి, పెద్దతండాలో మంగళవారం ఎక్సైజ్ సిబ్బంది దాడి చేశారు. పది లీటర్లు సారా స్వాధీనం చేసుకుని 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. పరారైన లావూరి నాగేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్లు నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు.